22. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 285 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం




- భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు
- రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సిఎం
- సిఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు



**సిద్దిపేట,మార్చి21 వెలుతురు:** సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర 2 లో..

## యుద్ధరీతులు మారుతున్నాయి

- యువత దేశ రక్షణకు నడుం బిగించాలి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ,మార్చి21 వెలుతురు:** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2 లో..

## ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం
- రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్



**న్యూఢిల్లీ,మార్చి21 వెలుతురు:** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు 2 లో..



## ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

- స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్,మార్చి21 వెలుతురు:** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన 2 లో..

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

- పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి
- పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత
- భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

2 లో..





## ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

**న్యూఢిల్లీ,మార్చి21 వెలుతురు:** ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు 2 లో..




## హర్మ్యూజ్ జలసంధిని తెరవండి

- ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,మార్చి21 వెలుతురు:** హర్మ్యూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, 2 లో..

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు


- వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,మార్చి21 వెలుతురు :** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, 2 లో..

## శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

- నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం
- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రారంభోత్సవాలకు రావడం.. రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట, మార్చి21 వెలుతురు:** సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం 2 లో..

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్



**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోడీ 2 లో..

## నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

- 23న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు
- కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక
- రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం

**విశాఖపట్టణం,మార్చి21 వెలుతురు:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో 2 లో..



## శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

- ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు
- వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు
- ఎఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు
- భక్తులను నేరుగా కలుసుకుని చర్చించిన చంద్రబాబు





**తిరుమల,మార్చి21 వెలుతురు:** సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం 8 లో..

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్

వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు లేదు

మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ఫైల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరపున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ఫైల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

## ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్టు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

### హర్మూజ్ జలసంధిని తెరవండి

జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోందని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

### ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం



తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

# శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.


ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

**జగిత్యాల,మార్చి21 వెలుతురు:**
పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

# యుద్ధరీతులు మారుతున్నాయి

పేర్కొన్నారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ



దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

## నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.

# తెలంగాణ హైకోర్టు రాష్ట్ర బార్ కౌన్సిల్ 2026 ఎన్నికల్లో మూడోసారి ఘనవిజయం సాధించిన వైస్ చైర్మన్ కుంచ సునీల్ గౌడ్

**- కుంచ సునీల్ గౌడ్ కి అభినందనలు తెలియజేసిన హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ 2026 ఎన్నికల్లో మూడోసారి ఘనవిజయం సాధించిన వైస్ చైర్మన్ కుంచ సునీల్ గౌడ్ గారికి అభినందనలు తెలియజేసిన హైకోర్టు సీనియర్ న్యాయవాదులు మరియు తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మొదటిసారి 2011లో బార్ కౌన్సిల్ మెంబర్గా గెలిచిన సునీల్ గౌడ్ గారు




న్యాయ వ్యవస్థలో ఎన్నో సేవలు అందించారు దానికి నిదర్శనంగా 2018లో మళ్లీ ఎన్నిక కాగా సునీల్ గౌడ్ గారిని బార్ కౌన్సిల్ సభ్యులు అందరూ కలిసి వైస్ చైర్మన్గా నియమించారు అంతేకాకుండా గత సంవత్సరం ఆయనను హైకోర్టు క్రికెట్ అసోసియేషన్ కెప్టెన్ గా ఎన్నుకున్నారు ఇప్పుడు మళ్లీ 2026 బార్ కౌన్సిల్ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన సునీల్ గౌడ్ గారి పట్ల యావత్ తెలంగాణ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు అలాగే నిత్యం న్యాయవాదుల సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తున్న సునీల్ గౌడ్ గారిని బార్ కౌన్సిల్ చైర్మన్గా ఎన్నుకోవాలని తెలంగాణ న్యాయవాద సంఘాలు మద్దతు తెలిపారు ఈ సందర్భంగా సునీల్ గౌడ్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిపించిన యావత్ తెలంగాణ రాష్ట్ర న్యాయవాదులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే నూతనంగా ఎన్నికైన బార్ కౌన్సిల్ మెంబర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాన్షిరామ్ కు భారతరత్న ఇవ్వాలి..

**- అమరావతి ఉద్యమ నేత, కాపు పొలిటికల్ జేపీసీ చెఎర్మన్. వేల్పూరి శ్రీనివాసరావు..**



**విజయవాడ వెలుతురు మార్చి 21:** ప్రపంచ రాజకీయ మేధావి , భారత దేశ చరిత్రలో గొప్ప నాయకుడు కాన్షరామ్ కి భారతరత్న ఇవ్వాలని కాపు పొలిటికల్ జేఏసీ చెఎర్మన్ వేల్పూరి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ, రాష్ట్రపతి కి లేఖ ను పంపించారు.. దేశంలో 90 శాతం ఉన్న వర్గాలు కు రాజ్యాధికారం సాధించాలని పోరాటం చేసిన మహా నాయకుడు కాన్సిరాం కి భారత రత్న ప్రకటించాలని, ఓట్లు మావి..సీ ట్లు మీవా అని ప్రశ్నించిన ఒకే ఒక్క నాయకుడు అని శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఒక సామాన్య దళిత మహిళ మాయావతి ని 4 సార్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గా చేసిన అసాధ్యుడు కాన్షిరాం అని శ్రీనివాస రావు పేర్కొన్నారు. కేవలం ఓటు బ్యాంక్ కోసమే గత ప్రభుత్వాలు కొందరికి భారత రత్న ఇచ్చి అవమానం చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ వంటి రాజ్యాంగ నిర్మాత కి 50 సంవత్సరాల తరువాత భారత రత్న ఇవ్వడం దేశానికే అవమానం అని చెప్పారు. కుల మత ప్రాంతాల కు అతీతంగా భారత రత్న ఇవ్వాలని కోరారు.సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే, మొట్టమొదటి మహిళా విద్యా ఉద్యమ నాయకురాలు , సావిత్రిబాయిపూలే లకూ భారత రత్న ఇవ్వకపోవడం దేశానికి అవమానం అని శ్రీనివాస్ పేర్కొన్నారు.

## - దామోదరం సంజీవయ్య గొప్ప నాయకుడు...

**- అమరావతి ఉద్యమ నేత, కాపు పొలిటికల్ జేపీసీ చెఎర్మన్. వేల్పూరి శ్రీనివాసరావు..**

నెహ్రూ,ఇందిరా , రాజీవ్ గాంధీ ఒక్క కుటుంబం లో ముగ్గురి కి భారత రత్న ఇవ్వడం సరికాదన్నారు.లక్ష మంది ఎన్టీఆర్, వైయస్సార్ ల కన్నా మాజీ ముఖ్యమంత్రి. మాజీ కేంద్ర మంత్రి, ఆలిండియా కాంగ్రెస్ పార్టీ 2 సార్లు అధ్యక్షులు గా చేసిన దళితుల ఆశా కిరణం ,38 సంవత్సరాల కు అతి చిన్న వయసులోనే సిఎం దామోదరం సంజీవయ్య గొప్ప నాయకుడు. దేశంలో అత్యంత నిజాయితీ సిఎం. సొంత ఇల్లు, స్థలం లేని ఏకైక సిఎం. మొట్టమొదటి సంక్షేమ పథకాలు అమలు చేసిన సిఎం. కర్నూలు జిల్లా కి ఆయన పేరు పెట్టకుండా కేవలం మాల సామాజిక వర్గం అని అన్ని ప్రభుత్వాలు, పార్టీ లు వివక్ష ప్రదర్శించారు. సిగ్గు చేటు, అవమానం తెలుగు ప్రజలు కు. రెడ్డి, కమ్మ సామాజిక వర్గం ఐతే వెంటనే అన్ని పథకాలు కి, జిల్లా కి పెట్టేవారు . కుల వివక్షను ప్రశ్నించాలి. మనం ఎవ్వరికీ బానిసత్వం చేయకూడదు.

# మనం ఫోన్‌ను వాడుతున్నామా? ఫోన్ మనల్ని వాడుకుంటోందా?




**డా .సూర్యదేవర రామకృష్ణ ,**

**9490754169**

*ప్రతి రోజూ ఉదయం సూర్యోదయాన్ని చూడకముందే మనం చూసే మొదటి వెలుగు స్మార్ట్‌ఫోన్ స్క్రీన్. కళ్ళు తెరిచిన క్షణం నుండి రాత్రి నిద్రలో కళ్ళు మూసే వరకు మన అరచేతిలో ఇమిడిపోయిన ఆ చిన్న పరికరం మన ప్రపంచాన్ని శాసిస్తోంది. వాట్సాప్ స్టేటస్‌లు, ఫేస్‌బుక్ రీల్స్, ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్, లింక్డ్‌ఇన్ అప్‌డేట్స్ ఇలా రకరకాల పేర్లతో మనం నిరంతరం ఆన్‌లైన్ లో శ్వాసిస్తున్నాం. వందలాది మిత్రులు, వేలాది మంది ఫాలోవర్లు, అసంఖ్యాకమైన లైక్‌లు, హార్ట్ ఎమోజీలు ఇవన్నీ చూస్తుంటే మనం ప్రపంచంతో అద్భుతంగా కనెక్ట్ అయ్యామనే భ్రమ కలుగుతుంది. మన జీవితం ఎంత వర్ణరంజితంగా ఉందో డిజిటల్ గోడల మీద ప్రదర్శిస్తాం. కానీ, ఆ ఫోన్ పక్కన పెట్టి ఒక్క క్షణం గుండె మీద చేయి వేసుకుని ఆలోచిస్తే, ఒక నిఖార్సైన సత్యం భయపెడుతుంది. మనం ఎన్నడూ లేనంత ఒంటరిగా ఉన్నాం. వేల మంది ఫ్రెండ్స్ మధ్య ఉన్నా, మనసు విప్పి మాట్లాడటానికి ఒక్కరు కూడా లేని డిజిటల్ శూన్యం లో బందీలమయ్యాం.*

ఆధునిక సాంకేతికత మనకు అసాధ్యమైన సౌకర్యాలను అందించింది. ఖండంతరాల దూరంలో ఉన్న వారితో క్షణాల్లో వీడియో కాల్ మాట్లాడగలం. ముఖ కవళికలను చూడగలం. కానీ, ఆ కళ్లలోని మెరుపును, ఆ గొంతులోని స్పందనను పట్టుకోలేకపోతున్నాం. మనం కేవలం సమాచారాన్ని (Information) పంపుకుంటున్నాం తప్ప, భావాలను (Emotions) పంచుకోవడం లేదు. ఒకప్పుడు ఒకరి కష్టాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకునే వాళ్ళం, ఇప్పుడు కేవలం 'ఘుఃజుఎశీయఱ'తో సరిపెడుతున్నాం. ఇది ఈ శతాబ్దపు అతిపెద్ద వైరుధ్యం. ప్రపంచం అంతా మన వేలి చివరనే ఉన్నా, మన పక్కన ఉన్న మనిషి మనకు అందనంత దూరమైపోయాడు.ఒక రెండు దశాబ్దాల క్రితం వెనక్కి వెళ్తే, సగటు మనిషికి పది మంది ప్రాణ స్నేహితులు ఉండేవారు. వారితో ప్రతి వారం కలుసుకోవడం, కష్టసుఖాలు చర్చించుకోవడం ఒక సామాజిక సంప్రదాయం. నేడు మన ఫేస్‌బుక్ జాబితాలో వెయ్యి మంది ఉండొచ్చు. కానీ మన పుట్టినరోజున ఫోన్ చేసి ఆత్మీయంగా పలకరించేది ఎంతమంది? మన కళ్ళల్లో నీళ్లు తిరిగినప్పుడు భుజం తట్టి నేనున్నాను అని ధైర్యం చెప్పేది ఎంతమంది? అధ్యయనాల ప్రకారం, డిజిటల్ ప్రపంచంలో ఎంతమంది ఉన్నా, నిజ జీవితంలో మనల్ని అర్థం చేసుకునే వారు కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే మిగులుతున్నారు. మిగిలిన వారంతా కేవలం స్క్రీన్ పరిచయాలు మాత్రమే.

సోషల్ మీడియా మనలో ఒక రకమైన వాలిడేషన్ (గుర్తింపు) పిచ్చిని పెంచుతోంది. ఒక ఫోటోకు వంద లైకులు వస్తే మనం గొప్ప వాళ్ళమని, రాకపోతే మనం దేనికీ పనికిరామని అనుకునేంతగా దిగజారిపోతున్నాం. లైక్ అనేది కేవలం ఒక మెకానికల్ క్లిక్ మాత్రమే. అందులో శ్రమ లేదు, ఆత్మీయత లేదు. ఎదురెదురుగా కూర్చుని గంటల తరబడి ముచ్చటించుకునే ఆ కాఫీ టేబుల్ సంభాషణలు ఇప్పుడు వాట్సాప్ చాటింగ్‌లుగా మారిపోయి, అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. సోషల్ మీడియాలో మనం చూసేదంతా ఒక ఎడిటెడ్ జీవితం. ఎవరూ తమ వైఫల్యాలను, కన్నీళ్లను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయరు. అందరూ తాము తిన్న ఖరీదైన ఆహారం, వెళ్లిన విదేశీ పర్యటనలు, పండించుకున్న వేడుకలనే చూపిస్తారు. ఇతరుల గ్లామరస్ ఫోటోలను చూసి, మన సాధారణ జీవితం చాలా అధమంగా ఉందని కుంగిపోవడం నేటి తరం శాపం. ఇతరుల హైలైట్ రీల్ ను మన బిహైండ్ ద సీన్స్ తో పోల్చుకోవడం వల్ల అసంతృప్తి బీజాలు పడుతున్నాయి. ఈ పోలికల సంస్కృతి మనిషిని నిరంతర ఒత్తిడిలోకి నెడుతోంది.నేడు మనం నిరంతరం అవైలబుల్ గా ఉండాలనే ఒత్తిడి ఎదుర్కొంటున్నాం. వాట్సాప్‌లో బ్లూ టిక్స్ పడితే వెంటనే రిప్లై ఇవ్వాలి, లేకపోతే అది అగౌరవం కింద లెక్క. లాస్ట్ సీన్ ను బట్టి మనుషుల ప్రవర్తనను అంచనా వేసే స్థితికి చేరుకున్నాం. దీనివల్ల ఏర్పడినదే ఫోమో (Fear Of Missing Out). అంటే, ప్రపంచంలో ఏదో జరిగిపోతోంది, అది నేను చూడకపోతే వెనుకబడిపోతానేమో అన్న ఆందోళన. ఈ ఆందోళన వల్ల యువత రాత్రిపూట నిద్రను త్యాగం చేసి ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. రెండు నిమిషాలు నోటిఫికేషన్ రాకపోతే ఏదో కోల్పోయినట్లుగా ఒక రకమైన విత్‌డ్రాయల్ సింప్టమ్స్ కనిపిస్తున్నాయి. ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణం. ఆఫీస్ సమయం ముగిసినా వర్క్ గ్రూపులలో మెసేజ్‌లు వస్తూనే ఉంటాయి. అటు కుటుంబానికి సమయం ఇవ్వలేక, ఇటు బాస్ మెసేజ్‌లకు రిప్లై ఇవ్వక తప్పని స్థితిలో మానసిక ప్రశాంతత కరువవుతోంది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అనేది కేవలం పుస్తకాల్లోని మాటగానే మిగిలిపోతోంది. మరో బాధాకరమైన విషయం ఏమిటంటే, ఒకే ఇంట్లో ఉంటూ కూడా కుటుంబ సభ్యులు వాట్సాప్‌లో మాట్లాడుకోవడం. భోజనం చేసేటప్పుడు డైనింగ్ టేబుల్ మీద నిశ్శబ్దం రాజ్యమేలుతోంది, కేవలం ఫోన్ల టిక్ టిక్ శబ్దాలు తప్ప. తల్లిదండ్రులు తమ పనిలో, పిల్లలు గేమింగ్ లేదా చాటింగ్‌లో మునిగిపోతున్నారు. ముఖాముఖి మాటలు కరువైపోవడం వల్ల పిల్లల్లో సామాజిక నైపుణ్యాలు (Social Skills) దెబ్బతింటున్నాయి. ఒకప్పుడు తాతయ్యలు, అమ్మమ్మలు చెప్పే కథలు పిల్లల ఊహాశక్తిని పెంచేవి. ఇప్పుడు ఆ స్థానాన్ని యూట్యూబ్ వీడియోలు ఆక్రమించాయి. మనం ఒక అద్భుతమైన క్షణాన్ని అనుభవించడం కంటే, దాన్ని రికార్డ్ చేసి లోకానికి చూపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఒక పుట్టినరోజు వేడుకలో కేక్ కట్ చేసే ఆనందం కంటే, ఆ వీడియోను స్టేటస్‌లో పెట్టినప్పుడు వచ్చే లైకుల మీదే మన దృష్టి ఉంటోంది. మనం క్షణాన్ని జీవించడం (Live the moment) మర్చిపోయి, కేవలం క్షణాన్ని బంధించడం (Capture the moment) లోనే తృప్తి వెతుక్కుంటున్నాం.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) హెచ్చరిస్తున్నట్లుగా, అధిక స్క్రీన్ సమయం మనిషిని డిప్రెషన్ వైపు నడిపిస్తోంది. నిద్రలేమి (Insomnia) వల్ల మెదడు మొద్దుబారిపోతోంది. ఫోన్ నుండి వచ్చే బ్లూ లైట్ మన నిద్రకు కారణమయ్యే మెలటోనిన్ హార్మోన్‌ను దెబ్బతీస్తుంది. దీనివల్ల ఏకాగ్రత లోపించడం, చికాకు, ఒంటరితనం వంటి లక్షణాలు పెరుగుతున్నాయి. మనిషికి శారీరక స్పర్శ, ఎదుటివారి కళ్లలోకి చూసి మాట్లాడటం వల్ల కలిగే ఉపశమనం ఏ యాప్ ఇవ్వలేదు. ఆక్సిటోసిన్ వంటి సంతోషకరమైన రసాయనాలు



కేవలం నిజమైన మానవ సంబంధాల వల్లనే విడుదలవుతాయి. ఆ కనెక్షన్ తెగిపోవడం వల్లే నేడు మన సమాజంలో మానసిక సమస్యలు రాజ్యమేలుతున్నాయి.మనం సాంకేతికతను వదిలేయలేం, కానీ దాన్ని మనల్ని నియంత్రించనివ్వకూడదు. దీనికి పరిష్కారం డిజిటల్ డిటాక్స్ . వారంలో కనీసం ఒక రోజు లేదా రోజులో కొన్ని గంటలు ఫోన్‌ను పక్కన పెట్టేయాలి.బెడ్‌రూమ్, డైనింగ్ టేబుల్ వద్ద ఫోన్లను అనుమతించకూడదు. మెసేజ్‌లు పంపే బదులు ఫోన్ చేసి మాట్లాడండి లేదా నేరుగా కలవండి. స్క్రీన్ చూడని పనులు, అంటే పుస్తకాలు చదవడం, తోటపని, పెయింటింగ్ వంటి వాటికి సమయం కేటాయించండి. మన ఫోన్‌లో ఏ యాప్ ఎంత సమయం తీసుకుంటుందో గమనించి, అనవసరమైన నోటిఫికేషన్లు ఆఫ్ చేయాలి.జీవితం అంటే ఫోన్ గ్యాలరీలో ఉండే ఫోటోల సమూహం కాదు. జీవితం అంటే మనం నవ్విన నవ్వులు, మనం పంచుకున్న కన్నీళ్లు. ఈ డిజిటల్ యుగంలో మనం ఎన్నో కోల్పోతున్నాం. కాబట్టి ఈ రోజే ఒక నిర్ణయం తీసుకోండి. మీ పిల్లలతో కలిసి నేల మీద కూర్చుని ఆడుకోండి. మీ భాగస్వామితో కళ్లలోకి చూస్తూ మనసు విప్పి మాట్లాడండి. ఫోన్ స్క్రోలింగ్ ఆపి, కిటికీలోంచి ప్రకృతిని చూడండి. మనకు కావాల్సింది వేల మంది ఫాలోవర్లు కాదు, మన కోసం ప్రాణమిచ్చే నలుగురు మనుషులు.సాంకేతికత మనల్ని ప్రపంచంతో కలుపుతుండవచ్చు, కానీ ప్రేమ మాత్రమే మనల్ని మనుషులతో బంధిస్తుంది. ఆన్‌లైన్ ప్రపంచం కేవలం ఒక అద్దం మాత్రమే, అది అసలైన బింబం కాదు. నిజమైన సంతోషం స్క్రీన్‌ల వెనుక లేదు, అది మన ఎదుట ఉన్న మనుషుల చిరునవ్వుల్లో ఉంది. కాబట్టి, కాసేపు ఆ స్క్రీన్ ఆపేద్దాం మనుషులను ప్రేమిద్దాం నిజమైన కనెక్షన్‌ను అనుభవిద్దాం.

# అంగరంగ వైభవంగా శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం

**- 22న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహణ**

**- ప్రపంచ రికార్డు సృష్టించనున్న ఘట్టం**

**- స్వచ్ఛందంగా తరలి వస్తున్న ఆర్యవైశ్యులు**

**- విజయవంతం చేయాలని కల్వ సుజాత గుప్త పిలుపు**

**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**

హైదరాబాద్ ఎల్ బీ స్టేడియం మరో అద్భుత చారిత్రక ఘట్టానికి వేదిక కాబోతోంది. ఈ నెల 22న ఆదివారం ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్టు సౌజన్యంతో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. దాదాపు 30 వేల మంది వైశ్యులు ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాలతో కూడిన వాసవీ పారాయణాన్ని సామూహికంగా ఆలపించనున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇన్ని వేల మంది ఒకే స్వరంతో పారాయణం చేయడం ప్రపంచరికార్డు కానుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఘనతను రికార్డు చేయడానికి గిన్నీస్ ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక , సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులందరినీ ఒక్కతాటిపైకి తేవడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఆర్యవైశ్య



కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త వెల్లడించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని ఆమె కోరారు. శనివారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త నేతృత్వంలో జరగనున్న ఈ ధార్మిక, సామాజిక కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇందులో పాల్గొంటున్నారు. ఏఐసీసీ సెక్రెటరీ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ టీ జీ వెంకటేశ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి టీజీ భరత్ గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారు. అధికారులు జయేశ్ రంజన్, సి.హెచ్.ప్రియాంక, వేముల శ్రీనివాస్, ఆర్ వీ కర్ణన్ లు ప్రత్యేక అతిథులుగా హాజరవుతున్నారు. 16 మంది పీఠాధిపతులు ఈ కార్యక్రమంలో భక్తులనుద్దేశించి మాట్లాడనున్నారు. అనేక సంఘాల భాగస్వామ్యం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్), ఫెడరేషన్ ఆవోపాస్ ఆఫ్ ఇండియా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ లాంటి అనేక వైశ్య సంఘాలు, సేవా సంస్థలు, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీలు శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవంలో పాలుపంచుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున ఈ మహోత్సవానికి స్వచ్ఛందంగా వస్తున్నారని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్టు గౌరవాధ్యక్షులు బెల్లి శ్రీధర్ తెలిపారు. ఈ మహోత్సవానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. అయితే హాజరు కాదలచిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే వేలాది మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వెల్లడించారు. వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. గాయని కల్పన ప్రత్యక్షంగా వాసవీ పారాయణాన్ని ఆలపించనున్నారని రంజని సిస్టర్స్ భజన్ జామింగ్ తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఈ వేదికపై ప్రదర్శించనున్నారన్నారు.

# ప్రజా ప్రభుత్వ బడ్జెట్ ఇది - ప్రజల ప్రశంసలు అందుకున్న బడ్జెట్

**- తెలంగాణబీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ షన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు మార్చి 21:**

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు నిదర్శనం 2026- 27 ఆర్థిక బడ్జెట్ అని, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం,దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందడగు వేస్తుందని అందుకు కాంగ్రెస్ నాయకత్వానికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు అందజేస్తున్నానని, తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రికార్డ్ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు సాగుతూ ప్రజలు చెల్లించే ప్రతి పైసాకు కాపలాధారుగా ఉంటూ వారి అభ్యున్నతి కోసమే ఈ బడ్జెట్ అత్యంత చిత్తశుద్ధితో రూపొందించడం జరిగిందని అన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన ప్రగతిని సాధించిందని దేశ జిడిపి వృద్ధిరేటు 9.8 శాతం నుండి 8 శాతానికి తగ్గి మందగమనంలో ఉన్నప్పటికీ తెలంగాణ వృద్ధి రేటు 10.6 శాతం నుండి10.7 శాతానికి మెరుగుపడడం విశేషమని అన్నారు. ప్రస్తుతం ధరల ప్రకారం రాష్ట్ర జి ఎస్ డి పి 17,82,198 కోట్ల రూపాయలకు చేరిందని దేశ సగటు వృద్ధిరేటు కంటే తెలంగాణ 2.7 శాతం అధిక వృద్ధిని నమోదు చేస్తుందని ఇందుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమన్వయంతో పని చేయడమే అని అన్నారు. దేశ జిడిపిలో మన రాష్ట్రం ఐదు శాతం వాటాతో బలమైన గ్రోత్ ఇంజన్ గా నిలుస్తుందని మన ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరియైన దిశలో సాగుతున్నాయి అనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే దిశగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట వేశారని దీనితో వారి సంక్షేమానికి మరింత




సంక్షేమ కార్యక్రమాలు అందే అవకాశం ఉందని అన్నారు.

### మధ్యాహ్న భోజనం పేదలకు వరం

ముఖ్యంగా బడ్జెట్లో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేసిందని జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించడం పేద విద్యార్థుల పాలిట వరం అని ఇది అభినందనీయమని ప్రస్తుతం పాఠశాల వరకే ఈ పథకం అమలు జరుగుతుందని దీని కాలేజీ విద్యార్థులకు కూడా అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించి ఇప్పుడు అమలులో పెట్టిందని పాఠశాలల్లో "ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ స్కీములు" కూడా ఈ బడ్జెట్లో ప్రతిపాదించడం స్వాగతించదగ్గ అంశమని ఈ పథకంతో ఇరవై ఒక్క లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందడం అభినందించదగ్గ అంశమని అన్నారు. ఏది ఏమైనా నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి దార్శినితకు నిదర్శనమని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం.. రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కెసిఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు




నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేకమంది పేదలకు లబ్ధి చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్ధరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది.
పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్దాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



**వాషింగ్టన్,మార్చి21( వెలుతురు):**
యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ్యా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# యుఎన్ఐ ఆఫస్ స్వాధీనం

- జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.


# బిఆర్ఎస్ పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వంలో భరోసా కోల్పోతున్న రైతు...!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*తెలంగాణ రైతాంగం కథ అనేది కేవలం వ్యవసాయం గురించినది కాదు.. అది ఒక సమాజం గుండె చప్పుడు, ఒక ప్రాంతం ఆత్మగౌరవం, ఒక కుటుంబం బతుకుదెరువు. ఒకప్పుడు ఈ నేల మీద రైతు అంటే కష్టాల ప్రతిరూపం. నీళ్లు లేవు, కరెంట్ సరిపడా లేదు, అప్పులు మాత్రం పెరుగుతూనే ఉండేవి. పంట పండకపోతే కుటుంబం ఎలా పోషించాలి అనే ఆందోళన ప్రతి రైతు గుండెల్లో నిత్యం మండే నిప్పులాంటిది. బోర్లు వేయించి నీళ్లు రాకపోతే అప్పులు మరింతగా పెరిగేవి. ఆర్థికంగా, మానసికంగా రైతు పూర్తిగా కుంగిపోయే పరిస్థితులు ఎన్నో చూశాం.*
*అయితే కాలక్రమేణా ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతాంగం మీద ప్రత్యేక దృష్టి పెట్టడం ప్రారంభమైంది. సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్, పెట్టుబడి సహాయం వంటి కార్యక్రమాలు రైతు జీవితంలో కొంత స్థిరత్వాన్ని తీసుకువచ్చాయి. పంట వేసే ముందు నుంచే రైతుకు ధైర్యం కలిగించే విధానాలు అమల్లోకి రావడం వల్ల అతను కొంతవరకు ఆర్థిక భద్రతను అనుభవిస్తున్నాడు. కేవలం పంట పండించడం మాత్రమే కాకుండా, రైతు గౌరవంగా జీవించాలి అనే భావనకు ప్రాధాన్యం పెరిగింది.*

ఈ మార్పు ఒక్క రోజులో రాలేదు. దీని వెనుక సంవత్సరాల పోరాటం ఉంది. తెలంగాణ ఉద్యమం సమయంలో రైతులు ఎదుర్కొన్న కష్టాలు, వారి ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటాలు ఈ మార్పుకు పునాది వేశాయి. నాయకత్వం తీసుకున్న నిర్ణయాలు, ప్రభుత్వం అమలు చేసిన విధానాలు రైతు జీవితాన్ని మలుపుతిప్పాయి. ఇప్పటికీ అన్ని సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయని చెప్పలేం కానీ, ఒకప్పుడు ఉన్న నిరాశ స్థానం లో ఇప్పుడు ఆశ కనిపిస్తోంది.
నేడు తెలంగాణ రైతు కేవలం బతుకుదెరువు కోసం పోరాడే వ్యక్తి కాదుడ తన కష్టానికి విలువ కోరుకునే, గౌరవంతో నిలబడాలనుకునే వ్యక్తిగా మారుతున్నాడు. ఇది కేవలం వ్యవసాయ మార్పు కాదుడ ఇది ఒక సమాజం మార్పు, ఒక ఆత్మగౌరవ యాత్ర. రైతు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది అన్న సత్యాన్ని ఈ కథ మరోసారి గుర్తు చేస్తోంది.
తెలంగాణ ఏర్పాటుకు ముందు పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో మనం మరచిపోలేం. వానలు కరువైపోయిన సంవత్సరాలుడ సాగునీరు అందని వేల ఎకరాలుడ పంటలు ఎండిపోవడండ అప్పులు పెరిగిపోవడండ బ్యాంకులు తలుపులు మూసేయడండ ప్రైవేట్ సాహుకారుల వడ్డీలు రైతు మెడపై బరువుగా మారడండ చివరికి రైతు ఆత్మహత్యలు. ఇవన్నీ ఒక ప్రాంతం ఎదుర్కొన్న నిజాలు. పెద్ద పెద్ద ఎకరాలున్న రైతులు కూడా నగరాలకు వలస వెళ్లి చిన్న పనులు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది అంటే వ్యవసాయం ఎంత దారుణంగా కూలిపోయిందో అర్థం చేసుకోవచ్చు.
అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం ఒక మలుపు. ఆ మలుపులో ముఖ్యంగా తీసుకున్న నిర్ణయాలు రైతాంగానికి ఒక కొత్త దారిని చూపించాయి. ఆ దారిలో ముఖ్యమైనది "రైతు బంధు" పథకం. ఇది కేవలం ఒక పథకం కాదుడ ఒక భావన. రైతును అప్పుల నుంచి బయటకు తీసుకురావాలనే సంకల్పం. రైతు తన పంటకు పెట్టుబడి కోసం అప్పులు చేయకుండా ఉండేలా ప్రభుత్వమే ముందుకు వచ్చి సహాయం చేయడం అనే ఆలోచన అప్పట్లో చాలా మందికి కొత్తగా అనిపించింది.
"రైతు బంధు" ద్వారా రైతుకు ప్రతి ఎకరానికి పెట్టుబడి సహాయం అందించడం వల్ల అతను పంట వేయడానికి ధైర్యం పొందాడు. బీజం కొనాలి, ఎరువులు కొనాలి, కార్మికులకు కూలి ఇవ్వాలిడ ఈ అన్నింటికీ అవసరమైన డబ్బు ముందుగానే చేతికి రావడం రైతుకు ఒక భరోసా ఇచ్చింది. ముఖ్యంగా వర్షాధార రైతులకు ఇది ఒక ఆశాకిరణంగా మారింది. అప్పుల బారిన పడకుండా వ్యవసాయం కొనసాగించగలిగే స్థితి ఏర్పడింది.
ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదుడ రైతు గౌరవాన్ని కాపాడిన పథకం. ఒకప్పుడు బ్యాంకుల ముందు తిరిగిన రైతుడ సాహుకారుల వద్ద వేడుకున్న రైతుడ నేడు ప్రభుత్వ సహాయం ద్వారా స్వయంగా నిలబడే స్థితికి రావడం చిన్న విషయం కాదు. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలపరిచింది. రైతు చేతిలో డబ్బు ఉంటే గ్రామంలో వ్యాపారం పెరుగుతుందిడ కార్మికులకు పని లభిస్తుందిడ మొత్తం గ్రామ జీవితం కదలికలోకి వస్తుంది.
అదే సమయంలో సాగునీటి ప్రాజెక్టులు కూడా తెలంగాణలో కీలక పాత్ర పోషించాయి. కాలువలు, చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులుడ ఇవన్నీ కలిసి నీటి సమస్యను కొంతవరకు తగ్గించాయి. నీరు అందుబాటులోకి రావడం వల్ల పంటల ఉత్పత్తి పెరిగింది. రైతు ఒకే పంట నుంచి రెండు మూడు పంటలు వేసే స్థితికి చేరుకున్నాడు. ఇది వ్యవసాయంలో స్థిరత్వాన్ని తీసుకువచ్చింది.
ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంపై రైతాంగం ఒక నమ్మకం పెంచుకుంది. "మా కోసం పనిచేస్తున్నారు" అనే భావన గ్రామాల్లో బలంగా కనిపించింది. అందుకే ఆ సమయంలో రైతులు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చారు. పథకాలు తమ జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని వారు అనుభవించారు.
కానీ నేడు పరిస్థితి మళ్లీ ప్రశ్నార్థకంగా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు అమలు విషయంలో స్పష్టత లేకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. కొంత ఇస్తూడ కొంత ఆపడండ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిడ ఇవన్నీ రైతు ప్లానింగ్‌ను దెబ్బతీస్తున్నాయి. వ్యవసాయం అనేది సమయపాలనతో నడిచే వ్యవస్థ. పెట్టుబడి ఆలస్యం అయితే పంట దెబ్బతింటుంది. ఇది ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి.
ఇంకా ఒక ముఖ్యమైన అంశం కౌలు రైతులు. సంవత్సరాలుగా "కౌలు రైతులకు సహాయం చేస్తాం" అని చెప్పడం జరుగుతోంది. కానీ ఆ హామీలు అమలులోకి రావడం లేదు. భూమి తనది కాకపోయినా వ్యవసాయం చేసే రైతు కూడా అదే కష్టాలు పడుతున్నాడు. అతనికి కూడా పెట్టుబడి అవసరం ఉంటుంది. కానీ ప్రభుత్వ పథకాలు అతడిని చేరుకోవడం లేదు. ఇది ఒక పెద్ద లోటు.
ప్రభుత్వం ఇక్కడ ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. రైతు అంటే కేవలం పత్తా ఉన్నవాడే కాదుడ పంట వేసే ప్రతి ఒక్కరూ రైతులే. కౌలు రైతులను పథకాల పరిధిలోకి తీసుకురాకపోతే వ్యవసాయ రంగం పూర్తి స్థాయిలో బలపడదు.



ఇక మార్కెటింగ్ సమస్యలు కూడా రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. పంట పండించడం ఒక భాగం మాత్రమేడ దాన్ని సరైన ధరకు అమ్ముకోవడం మరొక పెద్ద సవాలు. మార్కెట్ యార్డుల్లో అవ్యవస్థలుడ మధ్యవర్తుల ఆధిపత్యండ ధరలు పడిపోవడండ ఇవన్నీ రైతును మళ్లీ నష్టాల్లోకి నెడుతున్నాయి. ప్రభుత్వం ఇక్కడ కూడా బలమైన చర్యలు తీసుకోవాలి. కనీస మద్దతు ధర అమలు కచ్చితంగా జరగాలి. రైతు తన పంటకు న్యాయం పొందాలి.
ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాలను గంభీరంగా తీసుకోవాలి. గతంలో అమలైన మంచి పథకాలను కొనసాగించడం మాత్రమే కాదుడ వాటిని మరింత మెరుగుపరచాలి. రైతు బంధు వంటి పథకాలు సమయానికి, పూర్తి స్థాయిలో అమలు కావాలి. కౌలు రైతులకు ప్రత్యేక విధానం తీసుకురావాలి. మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయకూడదు.
రైతు అనేది ఓటు బ్యాంక్ కాదుడ దేశానికి ఆహారం అందించే వాడు. అతని కష్టాన్ని గుర్తించకపోతే సమాజం ముందుకు సాగదు. తెలంగాణ రైతాంగం గతంలో తన తీర్పు ఇచ్చింది. భవిష్యత్తులో కూడా అదే చేస్తుంది. ప్రభుత్వాలు మారవచ్చుడ కానీ రైతు సమస్యలు మారవు. వాటిని పరిష్కరించే బాధ్యత ఎవరిదైనా సరేడ తప్పించుకోలేరు.
ఇది ఒక హెచ్చరిక కాదుడ ఒక బాధతో చెప్పే మాట. రైతు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది. అతని చేతిలో విత్తనం ఉంటేనే మన భవిష్యత్తు ఉంటుంది. కాబట్టి రాజకీయ లాభనష్టాలను పక్కన పెట్టి రైతాంగాన్ని కాపాడే విధానాలను తీసుకురావాలి. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో రైతాంగం తన సమాధానం ఇస్తుందిడ అది మాటల్లో కాదు, ఓట్ల రూపంలో ఉంటుంది.
తెలంగాణ నేల చరిత్ర చెబుతోందిడ ఇక్కడి ప్రజలు మోసాన్ని ఎక్కువ కాలం సహించరు. రైతు కన్నీరు ఎప్పటికైనా ఎన్నికల తీర్పుగా మారుతుంది. ఆ తీర్పు ఎవరికైనా వర్తిస్తుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని రైతు సమస్యలను పరిష్కరించాలి. అదే నిజమైన పరిపాలనడ అదే ప్రజాస్వామ్యం అని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

## బడ్జెట్లో బీసీలకు తీరని అన్యాయం - ఎంపీ. ఆర్.కృష్ణయ్య



**బషీర్ బాగ్ వెలుతురు 21 మార్చి :** బడ్జెట్ లో బీసీలకు తీరని అన్యాయం చేశారని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ, ఆర్. కృష్ణయ్య ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీ ఉద్యమం బలంగా ఉన్న తరుణంలో ఇది బీసీలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు.బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ 14 సంఘాల అత్యవసర సమావేశం జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బడ్జెట్లో రూ.3 లక్షల 24 వేల కోట్లలో బీసీలకు కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంతో పాటు కామారెడ్డి డిక్లరేషన్లో ప్రతి యేటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించి, మూడు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి కూడా వాగ్దానం నెరవేర్చలేదని అన్నారు. తక్షణమే బడ్జెట్ ను సమీక్షించి ఎన్నికల వాగ్దానం ప్రకారం బడ్జెటు రూ.20 వేల కోట్లకు పెంచాలని అన్నారు. బీసీ కార్పోరేషన్, బీసీ కుల ఫెడరేషన్లకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని అన్నారు. ఒక్కో బీసీ కుటుంబానికి రూ.20 లక్షలతో పాటు 80 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో 14 బీసీ సంఘాల నాయకులు జిల్లపల్లి అంజి, అనంతయ్య, రాజేందర్, శివ కుమార్, ఆశిష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాగ్ అంబర్పేట్ బి.ఆర్ఎస్ కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి చేసిన అభివృద్ధి పనులు

**బషీర్ బాగ్ వెలుతురు 21 మార్చి :**



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో బాగ్ అంబర్పేట్ డివిజన్ ను అభివృద్ధి చేశాను బాగ్ అంబర్పేట్ బి.పద్మా వెంకటరెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పదవి కాలంలో రూ.69.70 కోట్లతో బాగ్ అంబర్పేట్ డివిజన్ ను కార్పొరేటర్ గా గెలిచిన 2020,21 నుండి పదవి కాలం ముగిసిన 2025.26 ఐదు సంవత్సరాలలో డివిజన్లలో డ్రైనేజీ వాటర్ లైన్లు ఎలక్ట్రిసిటీ వంటి మేజర్ పనులు చేసినట్లు ఆమె అన్నారు జిహెచ్ఎంసి కి సంబంధించిన 46.16 కోట్లతో వాటర్ సంబంధించిన రూపాలు 20.63 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు అంతేకాకుండా బతుకమ్మ కుంట మల్లికార్జున నగర్ ప్రాంతాలు కలిసి మంచినీటి సమస్య ఉంటే దాన్ని పూర్తిగా పరిష్కరించి కొత్త పైప్లైన్లు ఏర్పాటు చేశానన్నారు అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆయన సహకారంతో ఈ అభివృద్ధి పనులు చేశానని ఆమె అన్నారు.అభివృద్ధితో పాటు ప్రభుత్వం పనులు చేశామని వారు పేర్కొన్నారు ముంపు ప్రాంతాలను రక్షించుకున్నామన్నారు.

## మైనార్టీ సోదరుల ఇళ్లకు వెళ్లి పరస్పర స్నేహభావాన్ని చాటిన కాంగ్రెస్ నాయకులు





**మౌలాలి, మార్చి 21 వెలుతురు:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని మౌలాలి కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా 186 డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకన్న, హమీద్ భాయ్, ఉస్మాన్, ఇంతియాజ్, షకీల్, యూసుఫ్, మంద భాస్కర్, చంద్రకాంత్, ఎల్లం, సత్తన్న, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అజయ్ తదితర నాయకులు మైనార్టీ సోదరుల ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రంజాన్ పండుగ మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, ఉపవాస దీక్షల ద్వారా సహనం, నియమం, పరస్పర గౌరవం వంటి విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా గంగ–జమున సంస్కృతిని ప్రతిబింబించే మన భారతదేశంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి సాధనలో పరస్పర గౌరవం, సహకారం, సోదరభావం ముఖ్యమని పేర్కొంటూ అందరూ కలిసి ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రంజాన్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమం ఆప్యాయత, స్నేహభావంతో సాగి అందరినీ ఆకట్టుకుంది.

## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా గణేష్ నేత

**కూకట్ పల్లి మార్చి 21 వెలుతురు:**



ఆల్విన్ కాలనీ శంశిగూడ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముస్లిం మైనారిటీ సోదరులను కలిసి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలువురితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ "ఈద్ ఉల్ ఫితర్" సందర్భంగా "ఈద్ ముబారక్" శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ రంజాన్ నెల ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని ఈ నెల మొత్తం ముస్లిం సోదరులు భక్తి, నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తూ అల్లాహ్ ప్రార్థనలు చేయడం గొప్ప ఆచారం అని అన్నారు. రంజాన్ ముగిసిన అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈద్ పండుగను ఆనందంగా జరుపుకోవడం సంప్రదాయమని తెలిపారు. అలాంటి పవిత్ర సందర్భంలో మైనారిటీ సోదరులను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం తనకు ఆనందంగా ఉందని జిల్లా గణేష్ నేత పేర్కొన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## వినియోగదారులకు నాణ్యతమైన అభరణాలు అందించాలి

**- కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి స్వామి**

**- కామారెడ్డిలో ఎగ్జిబిషన్ అండ్ సెల్ ప్రారంభించిన వైస్ చైర్ పర్సన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 21**



వినియోగదారులకు నాణ్యమైన అభరణాలను అందించాలని కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి స్వామి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ అండ్ సెల్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వినియోగదారుల నమ్మకాన్ని చురగొన్నప్పుడే వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. జోయాలుక్కాస్ కంపెనీ వారు వినియోగదారులకు నాణ్యమైన అభరణాలతోపాటు ఆధునిక కాలంలో మహిళల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన అభరణాలను తయారుచేసినట్లయితే వ్యాపారం పెరుగుతుందన్నారు. నాణ్యమైన వస్తువులు ఇచ్చి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. జోయాలుక్కాస్ నిజాంబాద్ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి సత్యా కన్వెన్షన్ లో మూడు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, జోయాలుకాస్ కంపెనీ ప్రాంతీయ అధికారి సునీల్ పిఎస్, ప్రాంతీయ మేనేజర్ సిజ్జు సీజే, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కరుణాకర్, జోయాలుక్కా సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

## దళిత సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో చేవెళ్ల ఎస్సీ/ఎస్టీ డిక్లరేషన్ ఊసేలేదు

**- డీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్**



**భూపాలపల్లి వెలుతురు మార్చి 21:** 202627 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ. 3,24,254 కోట్ల బడ్జెట్లో దళిత సంక్షేమానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి (ఐఎఫ్‌టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్) భూపాలపల్లి జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు మహేందర్ అధ్యక్షతన స్థానిక కొమురయ్య భవన్ సమావేశం జరిగింది.ఈ సమావేశం డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో రూ. 40,000 కోట్లుగా ప్రకటించిన దళిత బడ్జెట్‌ను ప్రస్తుత బడ్జెట్లో కేవలం రూ. 11,784 కోట్లకు తగ్గించడం దళితులను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం ఘనంగా ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ/ఎస్టీ డిక్లరేషన్‌కు బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం ఆందోళనకరమన్నారు. 202627 సంవత్సరానికి ఎస్సీ సంక్షేమానికి కేవలం రూ. 11,784 కోట్లు మాత్రమే కేటాయించడం సరిపోదన్నారు. ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు బడ్జెట్ లేమితో వేలాది మందికి అందలేదని పేర్కొన్నారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.రాజీవ్ యువశక్తి పథకానికి 16 లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కేవలం రూ. 6,000 కోట్లు మాత్రమే కేటాయించడం తగదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా సుమారు 18% ఉన్నప్పటికీ, ఆ నిష్పత్తికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేవని విమర్శించారు.గత మూడు సంవత్సరాల బడ్జెట్ కేటాయింపులు, విడుదలలు, ఖర్చులపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డి హెచ్ పి ఎస్ రాష్ట్ర రెండవ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 17 18 తేదీల్లో వరంగల్ లో జరుగునని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజలింగం, భద్రయ్య, లావణ్య, సమ్మయ్య, సంపత్ పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి మహేందర్, అధ్యక్షులుగా రాచపల్లి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొన్నగంటి లావణ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా వేల్పుల సమ్మయ్య, జి రాజయ్య, చిట్యాల పద్మ, సహాయ కార్యదర్శి లు గా మద్ది మల్ల సంపత్, పెద్దముల సంధ్య, ఏ రాజమౌళి, కోశాధికారిగా వసం రజితల మరియు 15 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారని అనిల్ కుమార్ తెలిపారు.

## మంచాల మండలంలో ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

**- ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపిన వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు**



ఆరుట్ల గ్రామంలో ముస్లిం సోదరులను కలిసి ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇబ్రహీంపట్నం మార్కెట్ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్



ఆరుట్ల గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ వార్డు సభ్యులు



మంచాల మండలం మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సలాం కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్



మంచాల గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఉప సర్పంచ్ లింగం గౌడ్ మాజీ ఎంపిటిసి ఎద్మ నరేందర్ రెడ్డిగ్రామపంచాయతీ వార్డు సభ్యులు



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహమ్మద్ జానీపాషా కు రంజాన్ పండుగ తెలిపిన వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్



బండ లేమూర్ గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మంచాల వెలుతురు మార్చి 21:** మంచాల మండలం రంజాన్ పండుగ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఈద్గాదగ్గరకు వెళ్లి ముస్లిం సోదరులను కలిసి ఆలింగణం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల నాయకు లు ప్రజాప్రతినిధులు ఆరుట్లగ్రామంలో గ్రామ సర్పంచ్ మానిపాటిశోభాకుమార్ వార్డుసభ్యులు కలిసి ఈద్గాదగ్గరకు వెళ్లి ముస్లింసోదరులకు రంజాన్ శుభాకాంక్షలుతెలిపారు మంచాల మండల కేంద్రంలో మంచాల గ్రామసర్పంచ్ ఏర్పులమానస వినయ్ ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మంచాల మండలం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎద్మ నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రావులశ్రీనివాస్ మంచాల ఈద్గాదగ్గరకు వెళ్లి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు ఆరుట్లగ్రామంలో మంచాల సహకారబ్యాంక్ మాజీ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడుకొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇబ్రహీం పట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజు ముదిరాజ్ ఈద్గాదగ్గరకు వెళ్లి ముస్లింసోదరులను కలిసి ఆలింగణం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు బండలేమూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల నివాసం వద్దకు వెళ్లి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు లింగంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అమ్మనబోలు సంజీవరెడ్డి ఉపసర్పంచ్ బత్తుల కుమార్ ముస్లిం సోద రులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతి ని ధులు మాజీప్రజా ప్రతినిధులువి విధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్ల గ్రామంలో రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన కావలి బుగ్గరాములు ముదిరాజ్, వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్

**మంచాల వెలుతురు మార్చి 21:** మంచాల మండలం రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాదగ్గరకు వెళ్లి ముస్లిం సోదరులను ఆప్యా యంగా పలకరిస్తూ ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంచాలమండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్ వైయస్సార్ మాధగోని జంయ్యగౌడ్ ఈసందర్భంగా మాట్లాడుతూ ముస్లింసోదరులు నెలరోజులు కఠినమైనఉపవాస దీక్షలోఉండి భక్తిశ్రద్ధలతో పవిత్రంగా ఉంటూఆఅల్లాని తలుచుకుంటూ మతసామ్రాస్యానికి ప్రతీక గా హిందూముస్లిం భాయిభాయి అంటూ కులమతాలకు అతీతంగా అందర్నీ ఆహ్వానించి ఇఫ్తా ర్ విందులు ఏర్పాటుచేసి అందరితో కలిసిమెలిసి ఉండటం సంతోషకరమన్నారు ఎల్లప్పుడూ హిందూ ముస్లిం భాయిభాయి అంటూ కలిసిమెలిసి ఉండాలి అనిఅన్నారు ఈకార్యక్రమంలో



ఇబ్రహీంపట్నంమార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరీ ఎల్లేష్ మాజీసర్పంచ్ ఆనంగళ్ళయాదయ్య కాం గ్రెస్ పార్టీ నాయకులు ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకంబాలరాజు ముదిరాజ్ నాయకులు గుడ్డిమల్లచంద్రయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ ముస్లింసోదరులు మహమ్మద్ రావుఫూ మ హమ్మద్ రఫీక్ ఎస్.కె జావేద్ మహమ్మద్ అష్రఫ్ ఎస్.కె ఖలీల్ మహమ్మద్ అజీమ్ అఫ్జల్ తదిత రులు పాల్గొన్నారు

## మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు ఎండి రహీంషరీఫ్ కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మార్చి 21:** సంస్థాన్ నారాయణపురం మండలం రంజాన్ పండుగ సందర్భంగా మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు ఎండి రహీం షరీఫ్ నివాసానికి వెళ్లి. ఆ లింగనం చేసుకొని రహీం షరీఫ్ కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ అనంతరం రహీం షరీఫ్ తన నివాసానికి వచ్చిన నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ ను శాలువతో ఘనంగా స న్మా నించి విందు ఏర్పాటు చేశారు ఈసందర్భంగా వైయస్సార్ మాధగోనిజంగయ్యగౌడ్ మాట్లాడు తూ మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే గొప్ప పండుగ రంజాన్ పండుగ అని అన్నారు ఎల్లప్పుడు హిందూ ముస్లిం బాయి బాయి అంటూ కలిసిమెలిసి ఉండాలని అన్నారు ఈ కార్య క్రమంలో మంచాల మండలం వైయస్సార్ యువసేన నాయకుడు లొంగారి యాదగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు బైకని నరేందర్ యాదవ్ ఆదెల నరేష్ యాదవ్ స్థానిక నాయకులు తదితరు లుపాల్గొన్నారు





నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకుడు రహీం షరీఫ్

## బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

**- మహిళ కలుపై నుంచి వెళ్లిన బస్సు**

**యాదగిరిగుట్ట,మార్చి21( వెలుతురు):** హైదరాబాద్‌లోని నార్సింగ్‌కు చెందిన అనిత తన కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వచ్చింది. ఆమె తన కుటుంబ సభ్యులతో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో



అనిత కొండపై ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా.. సడెన్‌గా ఆర్టీసీ బస్సు కదిలింది. ఈ క్రమంలో అనిత కిందపడటంతో బస్సు ఆమె కాలు మీదుగా వెళ్లింది. దీంతో అనిత కాలుకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను వెంటనే యాదాద్రి టెంపుల్ సిబ్బంది హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

## మానవాళి హితాన్ని ఆకాంక్షించే పర్వదినం రంజాన్...

**- బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర నాయకులు ఎండి ముజీబ్...**

**కరీంనగర్ వెలుతురు మార్చి 21:**



పరమత సహనం, సమానత్వం, సమైక్య స్ఫూర్తితో మానవాళి హితాన్ని ఆకాంక్షించే పవిత్రమైన పర్వదినం రంజాన్ అని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకులు ఎండి ముజీబ్ అన్నారు. ఈద్–ఉల్–ఫితర్ రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర,సోదరీమణులందరికీ భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా పక్షాన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మార్చి 21:**



పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించు కొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జీహెచ్ఎంసీ దుండిగల్ పరిధి మల్లంపేటలోని గ్రామంలోని ఈద్గా వద్ద నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణులకు, ప్రజలకు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈద్–ఉల్–ఫితర్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్న ఆయన, రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనకు సహనం, నియమం, దాతృత్వం వంటి విలువలను నేర్పుతాయని తెలిపారు. గత పన్నెండేళ్ళ కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలతో పాటు ప్రార్థనా మందిరాల అభివృద్ధికి కృషిచేశామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మల్లంపేట ఈద్గాను మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మాదాసు వెంకటేశం, హన్మంత్ రావు, అర్కల అనంతస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ఎస్.వి సురేందర్ రెడ్డి, రంగయ్య, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

# 9వ, 10వ వార్డుల్లో మోరి సమస్యకు శాశ్వత పరిష్కారం

**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 21:**



నార్కట్‌పల్లి పట్టణంలోని 9వ మరియు 10వ వార్డుల్లో గత మూడు నుండి నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న మోరి సమస్యకు సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ తక్షణ పరిష్కారం చూపించారు. ఈ ప్రాంతాల్లో మోరీలు గుంతలమయం కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కారులో ప్రయాణించే వారు తరచుగా ప్రమాదాలకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించిన ఆయన, మోరీలోని పూడికను తొలగించి సమస్యను పరిష్కరించారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న ఈ సమస్య పరిష్కారం కావడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, "యువ సర్పంచ్ అయిన భరత్ కుమార్ ని గెలిపించుకోవడం మా అదృష్టం. సమస్య ఏదైనా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నారు" అంటూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 9వ, 10వ వార్డు సభ్యులు, వార్డు ఇంచార్జీలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 21:**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నకిరేకల్ నియోజకవర్గంలోని పలు మసీదుల వద్ద ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ నెలలో భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు పాటించి పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంట్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలో రంజాన్ సహా అన్ని పండుగలు అంగరంగ వైభవంగా నిర్వహించబడేవని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమం కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు, షాదీ ముబారక్, మసీదుల అభివృద్ధి, రంజాన్ గిఫ్ట్ ప్యాకులు, మైనార్టీ కార్పొరేషన్లు, స్కాలర్‌షిప్‌లు వంటి అనేక పథకాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశానని తెలిపారు. నకిరేకల్ మండల కేంద్రంలో షాదిఖానా నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు చేసి, స్థలం ఏర్పాటు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తిచేసినా, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. అలాగే నార్కట్‌పల్లి, చిట్యాల మండల కేంద్రాలలో షాదిఖానాలను అభివృద్ధి చేశామని, రామన్నపేటలోని అలీ సాహెబ్ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

# పేద ముస్లిం ఒంటరి మహిళకి స్వంత నిధులతో ఇల్లు నిర్మించి ఇచ్చిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

**- నా లాంటి పేదోళ్లకి పెద్ద కొడుకు అయి అండగా నిలుస్తున్న ర్యాకల శ్రీనివాస్ కి జీవింతాంతం రుణపడి ఉంటానన్న అమీనా బీ**

**- గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తా**

**- ఆర్ ఎస్ కే ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**



**భువనగిరి , మార్చ్ 21 (వెలుతురు ):** భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామానికి చెందిన పేద ముస్లిం ఒంటరి మహిళ అయిన షేక్ అమీనా బి చాలా రోజులుగా ఉండడానికి ఏ విధమైన ఆవాసం లేక చాలా ఇబ్బంది పడుతుంటే ఆమె పరిస్థితి చూసి ఆమెకోసం మన గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ తమ ఆర్ ఎస్ కె ఫౌండేషన్ ద్వారా స్వంత ఖర్చులతో సామాజిక వేత్త , డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటిని నిర్మించి ఇచ్చారు . నిర్మించి ఇచ్చిన ఇంటిని రంజాన్ పర్వదినం సందర్భంగా వారితో కలిసి గృహ ప్రవేశం చేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా నా సహాయ సహకారాలు ఉంటాయని, గ్రామ ప్రజల శ్రేయస్సే తన ముఖ్య కార్యాచరణ అని వారు హామీ ఇచ్చారు . ఇంటి నిర్మాణం అనంతరం రంజాన్ పండుగ సందర్భంగా గృహ ప్రవేశం చేసిన అమీనా బీ ఎంతో సంతోషంగా నా పెద్ద కొడుకు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అని ఆయన కుటుంబం మొత్తం అల్లా దయతో సంతోషంగా ఉండాలని దీవించారు . నా లాంటి పేదోళ్లకి పెద్ద కొడుకు అయి అండగా నిలుస్తున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు . ఈకార్యక్రమంలో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, ఓరుగంటి మానస నాగరాజు, స్థానిక వార్డు సభ్యులు షేక్ అహ్మద్, గ్రామ పెద్దలు, యువకులు, మైనారిటీ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన టీ జె ఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా**





**మోటకొండూర్ టౌన్ మార్చి 21 (వెలుతురు న్యూస్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో శనివారం రోజున స్థానిక ఈద్గాలో ( ఈద్-ఉల్-ఫితర్ )రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ బురాన్, అఫ్జల్, జహంగీర్,ఘౌస్,ఖలీల్,అన్వర్, సుభాని,సలీం, మునీర్, కాజా,గాలిబ్ సద్దాం, యాకుబ్ పాషా, జహంగీర్, అజీమ్, జుబెర్,మొయిన్, ఖాజా, చాన్,తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో ఘనంగా రంజాన్ వేడుకలు...

**ముఖ్య అతిథిలుగా హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, అదనపు రెవిన్యూ కలెక్టర్ వెంకరెడ్డి, సబ్ కలెక్టర్ కృష్ణ రెడ్డి, తహసీల్దార్ చీకూరి జగన్, మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్**



**భువనగిరి, మార్చి 21 (వెలుతురు న్యూస్):** జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో,సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగ,వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే పట్టణం లోని ఈద్గా ఆవరణలోకి చేరుకున్న,ముస్లిం లు సామూహికంగా ప్రత్యేక నమాజు చేశారు.పట్టణంలోని ప్రాచీన ఈద్ గాహ్ లొ మౌలానా తౌసీఫ్ ఆధ్వర్యంలో ఉదయం 9 -30గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజు అనంతరం మౌలానా తౌసీఫ్ లు రంజాన్ పండుగ ప్రాముఖ్యతతో పాటు పవిత్ర ఖురాన్ బోధనలు,శాంతి సందేశం చదివి వినిపించారు. వేలాది మంది ముస్లిం సోదరులు తమ కుటుంబ సమేతంగా,ఆయా ఈద్గాలకు చేరుకుని ఉపన్యాసాలను ఆలకించారు. శాంతి,ప్రేమ సహనం,మానవత్వం వంటి మూల్యాలను పాటించడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చుని స్పష్టం చేశారు. రంజాన్ మహోత్సవం వల్ల వ్యక్తిగత ఆత్మశుద్ధి, సమాజంలోని అన్ని వర్గా ల మధ్య ఐక్యత పెంపొందుతుందని వివరించారు. ప్రార్థనలు ముగిసిన వెంటనే ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

**వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం ప్రత్యేక హాజరు...**

ఈ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్,పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన ముస్లిం పెద్దలతో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ అనేది భక్తి, ఉపవాసం,పరస్పర ప్రేమ సహాయ సహకారాల ఉత్సవమని,అన్నారు.ఇది మత సామరస్యానికి,మానవ సంబంధాలకు ప్రతీకయని, అన్ని మతాల ప్రజలు కలిసి ఉండే భువనగిరిలో ఈ వేడుక మరింత ప్రత్యేకంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేగాక పట్టణంలోని ముస్లిం సోదరుల సమస్యలను తెలుసుకుని,ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సంక్షేమానికి సంబంధించిన పథకాలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వం తరపున ప్రత్యేక ఏర్పాట్లు...**

రంజాన్ పండుగను పురస్కరించుకుని పోలీసు, మునిసిపల్, విద్యుత్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్, డిఎస్పి రవీందర్ ప్రత్యేక పర్యవే క్షణలో ఆయా ఈద్గాల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. మునిసిపల్ అధికారులు మసీదుల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులను పకడ్బందీగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుని,ఎక్కడా విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకుంది.మసీదుల వద్ద తాగునీటి సదుపాయాలు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

**సాంప్రదాయ విందు..ఆనందంగా పండుగ వేడుకలు..**

రంజాన్ సందర్భంగా ప్రతి ఇంటిలోనూ భోజన విందు ఏర్పాట్లు జరిగాయి.షీర్ ఖుర్మా, బిర్యానీ,హాలీం సేమియా వంటి సంప్రదాయ వంటకాలను కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు ఆనందంగా పంచుకున్నారు.చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.ఈ వేడుకల్లో హిందూ, క్రైస్తవ తదితర మతాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గొని, ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భువనగిరిలో రంజాన్ వేడుకలు అన్ని మతాల ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత పెంచాయి.ఈ వేడుకల్లో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ నేతలు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ రంజాన్ వేడుకల్లో గ్రంధాలయం చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి రవికుమార్ వైస్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేష్ మంజుల,మత పెద్దలు,శేక్ మీరా యువ నాయకుడు,మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్ష ప్రధాన,కార్యదర్శి ఎండీ ఇంతియాజ్ అహ్మద్,ఎండీ ఇస్తియాక్ అహ్మద్,డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహర్,కౌన్సిలర్ లు శఫీఖ్ అహ్మద్ జాలిగం విగ్నేష్ బొంతల నర్సింహా,నాయకులు కౌసర,హామీద్ పాషా,డాక్టర్ బారి అస్గర్ రబ్బానీ,బి ఆర్ ఎస్ పార్టీ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లిలో వెల్లివిరిసిన మత సామరస్యం

## - గంగా-జమున తహజీబ్‌కు అద్దం పట్టిన 'దావతే ఇఫ్తార్'

**- సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు**

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్**











**కేసముద్రం వెలుతురు మార్చి 21:** కేసముద్రం మండల ప్రజలు మత సామరస్యానికి నిలయంగా, గంగా-జమున తహజీబ్‌కు ప్రతీకగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో 'దావతే ఇఫ్తార్' వేడుక కన్నుల పండువగా జరిగింది. సమ్మి గౌడ్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సమ్మేళనంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించి తన ఉదారతను చాటుకున్నారు..

**అల్లాహ్ కృప.. ప్రజా ప్రతినిధుల చొరవ**

ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ "ముఖ్యంగా స్థానిక కాంగ్రెస్ వార్డు ప్రతినిధులు తండ సంపత్ గౌడ్, పలుస పద్మా వెంకన్న గౌడ్, కంచ రాజు కుమార్, బోనగిరి జ్యోతి, జనిగల అనిల్, యూత్ ఉపాధ్యక్షులు పలుస రాకేష్ గౌడ్, షబ్బీర్ కోరిక మేరకు, వారిపై ఉన్న ప్రేమ,గౌరవంతో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పవిత్రమైన కార్యం నిర్వహించే భాగ్యం కలగడం కేవలం ఆ అల్లాహ్ కృప వల్లే సాధ్యమైంది" అని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసం క్రమశిక్షణకు, త్యాగానికి మరియు సోదరభావానికి ప్రతీక అని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన భారతీయ సంస్కృతికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఉప్పరపల్లిలో ఈ రకమైన ఐక్యత చూడటం గర్వకారణంగా ఉందని, భవిష్యత్తులోనూ అందరం కలిసికట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ఇటువంటి సామాజిక కార్యక్రమాలకు, పేద ప్రజల సేవకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ముస్లిం కుల పెద్దలు మహమ్మద్ అమిరుద్దీన్, మహమ్మద్ పర్వేజ్ ఆలం (మొల్సబ్), మహమ్మద్ షబ్బీర్, రియాజ్, అజ్మాత్, గోర్మియా, అల్లవుద్దీన్, ఆజ్మీ యా, రహీంపాషా, సలీం పాషా, యాకుబ్, సర్వల్, రజాక్, గౌస్, నజీర్, సలీం పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రముఖులు మరియు వార్డు ప్రతినిధులు: గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీతా కుమార స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, పలుస వెంకన్న, నలకుర్తి ఉప్పలయ్య, పందిరి రాజు, పబ్బతి సారంగం, తండా శ్రీనివాస్, పలుస సంపత్, కోమాకుల రమేష్, బోనగిరి వీరయ్య, టేకుల మల్లారెడ్డి, అడపా రమేష్, ఎటు రోజు పరిపూర్ణ చారి, వత్సల సాంబయ్య, ఎసల్ల రాజు, జీజుల సందీప్, భోనగిరి రమేష్, గుండా కార్తీక్, పలుస రాకేష్, గై వెంకన్న, శాగంటి రాములు, శాగంటి శ్రీనివాస్, ఎసల్ల సత్యం, తండా వెంకటేశ్వర్లు, బండారు అనిల్, మంద విక్రమ్, కంది సుధాకర్, పోలపాక ఉప్పలయ్య, రాజబోయిన యాదగిరి, కంచ కట్టయ్య, రవిచంద్ర, ఆవుల బాబు, ముదురుకోల రమేష్, పోల్దాసు సూరయ్య, బండారు వేణు, ముదురుకోల సంతోష్, పలుస నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21:**



గ్రామం ఇంద్రపాలనగరం ముస్లింల పవిత్రరంజాన్ పండగ సందర్భంగా మత సామరస్యానికి ప్రతీక గా కమ్యూనిస్ట్ నాయకులు మీర్జాజా సోదరులు హైమద్,యాసిన్,లువారి స్వగృహం లోఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియ చేసిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ, స్వామి ,కాటపల్లి యాదయ్య మాజీ సర్పంచ్,రాస వెంకటేష్,సింగణబోయిన జంగయ్య, మంటిలింగస్వామి, రవ్వ నర్సింహా,సింగణబోయిన మల్లేష్,గన్నేబోయిన శ్రీనివాస్,కొమ్మగోని వెంకటేష్, కొమ్మగోని అశోక్, బొల్ల నాగరాజు,బోనగిరి శ్రీనివాస్, చిన్నపాక సురేష్, కంటేశ్వర్ రమేష్, వెలకుర్తి జానాచారి,రాధారపు మల్లేశం,నాగు నర్సింహా,బబొల్ల మచ్చి , బోదాస్ నరేష్,బుడ్డ యాదగిరి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియచేశారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21:** మండల కేంద్రంలోని రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఎస్కే చాంద నివాసం వద్ద ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి అల్లా ఆశీస్సులు ముస్లిం సోదరులందరికీ ఉండాలని అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు పల్లివాడ ఇంద్రపాలనగరం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు బత్తుల వెంకన్న, కోనూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి, చొప్పరి నరసింహ, బాలగోని నరసింహ, ఆవుల నరేందర్, ఎండి అజాజ్ ఖాన్, మంటి లింగస్వామి, ఆవుల శ్రీధర్, రాస వెంకటేశ్వర్లు, బొలుగుల కృష్ణ, జాల అమరేందర్ రెడ్డి, నల్ల సైదులు, ఎండి మోసబ్, బాసాని రాజు, ఎండి ఆరిఫ్, లింగస్వామి, పావిరాల నరసింహ, రైమహన్, భరత్, యాదగిరి తదితరులు పాల్గొనడం జరిగింది.

# చనిపోయిన పగిళ్ల దుర్గమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**- బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21:** గ్రామం కొమ్మాయగూడెం వాస్తవ్యురాలు పగిళ్ల దుర్గమ్మ ఇటీవల కాలంలో పరమపదించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బెల్లి లింగస్వామి, మోటే శ్రీను, బాతురాజు దుర్గయ్య, దావులూరి బాలయ్య, రేపాక లింగస్వామి, మచ్చ మహేష్, బెల్లి మృత్యుంజయ్, జల లింగస్వామి, శ్యామల గణేష్, గురజాల ప్రదీప్ రెడ్డి, ఎర్ర సురేష్, దావూరి యాదయ్య, రేపాక జంగయ్య, తిరుపాల అశోక్ ,తిరుపాల మల్లేష్, ఆకిటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే పిఎం సంసద్ ఖేల్ లక్ష్యం

- దాసరి మల్లేశం బిజెపి రాష్ట్ర నాయకులు
- 22న పిఎం సంసద్ ఖేల్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 21:**



ప్రధానమంత్రి సంసద్ ఖేల్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం మార్చి 22 ఆదివారం నిర్వహిస్తున్నామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం తెలిపారు. శనివారం పట్టణంలోని రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనవరి నెలలో మొదలై ఏడు అసెంబ్లీ స్థానాల్లో అన్ని పాఠశాలలో విజయవంతంగా నిర్వహించిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్,క్రికెట్,ఖో ఖో క్రీడల్లో ప్రథమ,ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్న క్రీడాకారులకు భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాజీ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేయనున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ వేడుకలకు కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్.వర్మ, రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్, ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అతిధులుగా విచ్చేస్తున్నారని తెలిపారు.ఈ ప్రధానమంత్రి సంసద్ ఖేల్ గ్రామీణ ప్రాంత క్రీడలను,క్రీడాకారులను, యువతను,ప్రోత్సహించడం వంటి దృఢమైన సంకల్పాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని.కావున యువత చదువుతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలనేదే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో యువత మరియు క్రీడాకారులు హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య,స్టేట్ కౌన్సిల్ మెంబర్ వన్ అంజయ్య,యువ మోర్చా జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, పల్లపు దుర్గయ్య,దావునూరి అజయ్,శానగొండ మల్లికార్జున్, జంగిలి సత్యనారాయణ,బట్టె రమేష్,సుర్వి హరిబాబు,బాత్క నరేష్,బెల్లి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గుండాల మండలంలో రంజాన్ పండుగ ప్రత్యేక ప్రార్ధనలు

**గుండాల మార్చి 21.(వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వివిధ గ్రామాల తో పాటు గుండాల మండల కేంద్రంలో రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు గ్రామ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు 40 రోజులుగా రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్ష అనంతరం వారి పూర్వీకుల సమాధుల వద్ద గులాబీ పూలతో అలంకరించి ఆ ప్రదేశంలో ప్రార్ధన నిర్వహించారు. అనంతరం ప్రతి కుటుంబ బీదవారికి సహాయం చేసి తమ భక్తిని చాటుకున్నారు ఇందులో భాగంగా ఒకరికి ఒకరు చిన్న పెద్ద తేడా లేకుండా ఆలింగణం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సదర్ షాబుద్దీన్ గాయాసోద్దీన్ ఇమామ్ ఫెరోజ్ ఖలీల్ అన్వర్ షబ్బీర్ ఇర్ఫాన్ జలీల్ సిరాజ్ షరూఫోద్దీన్ బురాన్ కుతుబుద్దీన్ రిజ్వాన్ రహమత్ అల్తాఫ్ అన్సార్ ఇస్మాయిల్ సఫాన్ అజమ్ జహంగీర్ అబ్బాస్ నురు యాకుబ్ కాలిద్ వాజిద్ బాసిద్ ఆదిల్ బషీర్ ఉస్మాన్ మోయిస్ నసీర్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మునుగోడు, మార్చి 21 ( వెలుతురు):**



మండల కేంద్రంలోని బట్ల కాలువకు చెందిన పులకరం వెంకన్న ఆకస్మిక మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది.శుక్రవారం ఆయన కన్నుమూయగా, శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన మృత దేహానికి నివాళు లర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.భవిష్యత్తులో కూడా కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్వాయి చెన్నారెడ్డి, యసరాణి సైదులు, నారగోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్సై వీరశేఖర్

**తిరుమలగిరి( సాగర్) వెలుతురు న్యూస్ మార్చ్ 21:**



మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) ని ఈద్గా వద్ద అత్యంత భక్తి శ్రద్దలతో ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థన అనంతరం తిరుమలగిరి సాగర్ ఎస్ఐ వీరశేఖర్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఉపవాస, ధ్యాన, దానధర్మ కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సహోదరభావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఆయన కొనియాడారు. రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సామరస్యం నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే రహీం ,షేక్ సుభాన్ ,షేక్ సుభాన్ ,ఎస్కే ఇబ్రహీం ,ఎస్కే కమాల్ ,ఎస్కే షంషోద్దీన్ , ఎస్కే రసూల్ ,ఎస్కే అక్రం ,ఎస్కే షకీల్ ,అకీల్ , ఎస్కే గాలి సాహెబ్ ,ఎస్కే యాసీన్ ,ఎస్కే బాషుమియా ,ఎస్కే ముస్తఫ ,ఎస్కే సమీరు , ఎస్కే మూస, ఎస్కేహైమద్ ,ఎస్కే రహీం ,తదితరులు పాల్గొన్నారు.

## యాతాకుల రాములమ్మకు నివాళులు అర్పించిన టీడీపీ శ్రేణులు

**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 21:**




నకిరేకల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్‌చార్జి ఆకుల అంజయ్య గారి తల్లి యాతాకుల రాములమ్మ శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామం కడపర్తిలో మరణించారు. ఆమె భౌతిక కాయానికి శనివారం రోజున తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ, భువనగిరి పార్లమెంటు నాయకులు నక్క రాం బణేష్, పార్లమెంటు కార్యదర్శి లింగాల యాదయ్య, నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడు బంగారం శివరాం ప్రసాద్, నకిరేకల్ మండల అధ్యక్షుడు అంతటి రాములు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే చిట్యాల మండల అధ్యక్షుడు కొంపల్లి అశోక్, పట్టణ అధ్యక్షుడు కొంపెల్లి సైదులు, నార్కట్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి చింత రాజు, భువనగిరి పార్లమెంటు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చింత లక్ష్మణ్, చిట్యాల నాయకుడు మేడి లింగయ్య తదితరులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## కోమటిరెడ్డి బ్రదర్స్‌పై చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారం

**మునుగోడు, మార్చి 21 ( వెలుతురు ):**



కోమటిరెడ్డి బ్రదర్స్‌పై కొందరు చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమని చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు తీవ్రంగా ఖండించారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే కృషిని చూసి అసూయతో కొందరు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

**ప్రాజెక్టులతో పురోగతి**

బ్రాహ్మణవెల్లంల నీటిపారుదల ప్రాజెక్టు అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి విశేషమని తెలిపారు.ఎడమ కాలువను ఉరుమడ్ల నుంచి కిష్టాపురం వరకు విస్తరించడం రైతులకు లాభదాయకమని పేర్కొన్నారు. గత వేసవిలో స్వంత నిధులతో కాలువ తవ్వించి చెరువులకు నీరు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో రిటైర్డ్ ఇంజనీర్లతో సమీక్షలు నిర్వహిస్తూ డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ నిధులు సమీకరిస్తున్నారని వివరించారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్య మిస్తూ**

కబ్జా సమస్యలో ఉన్న భూమిని రక్షించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మార్గం సుగమం చేశారని, మర్రిగూడ మండలంలోని కస్తూరిబా పాఠశాల అభివృద్ధికి స్వంత నిధులు వినియోగించారని చెప్పారు. సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేయకుండా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.అభివృద్ధి అంశాలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కోహిర్ పట్టణంలో ఘనంగా రంజాన్ పండుగ

- ప్రత్యేక ప్రార్ధనల్లో భారీగా పాల్గొన్న ముస్లిం సోదరులు....
- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్....!





**జహీరాబాద్ వెలుతురు మార్చి 21:**

సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణంలో శనివారం రంజాన్ పండుగను ముస్లిం మైనార్టీ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన సందర్భంగా ఉదయం నుంచే మసీదులు మరియు పట్టణ శివార్లలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మసీదులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. చిన్నారులు నుంచి పెద్దల వరకు అందరూ కొత్త దుస్తులు ధరించి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, కౌన్సిలర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలు, మత గురువులు, సామాజిక ప్రముఖులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంగారెడ్డి జిల్లా పోలీసుల పర్యవేక్షణలో కోహిర్ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ముఖ్య కూడళ్ల వద్ద పోలీసులు పర్యవేక్షణ చేపట్టి పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ మాట్లాడుతూ ముస్లిం సోదరి సోదరులు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సౌహార్దం పెంపొందాలని అన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి అలై బలై తీసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## జహీరాబాద్ మండలంలో ఘనంగా రంజాన్ పండుగ

- ముస్లిం కుటుంబాలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు తట్టు నారాయణ...







**జహీరాబాద్ వెలుతురు, మార్చి 21:**

జహీరాబాద్ మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముస్లిం మైనార్టీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ముస్లిం నాయకులు, కుటుంబాల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మరియు ప్రస్తుత కౌన్సిలర్ తంజీమ్, మాజీ పట్టణ అధ్యక్షుడు మోహియొద్దీన్, హోతి బి గ్రామ అధ్యక్షుడు పర్వేజ్, సత్వార్ గ్రామ అధ్యక్షుడు సహీద్, మొహమ్మద్ అలీ జుబేర్ (హౌసింగ్ బోర్డు), ఫహీమ్ (గాంధీనగర్) తదితరుల నివాసాలకు వెళ్లి నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో న్యాల్కల్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచులు మచ్చేందర్, రాథోడ్ భీం రావు, రాజు సత్వార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అమీత్ కుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు రాజా రమేష్, నియోజకవర్గ ఎస్టీ నాయకుడు సంజు పవార్, మాజీ సర్పంచ్ విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ ముస్లిం సోదరి సోదరులు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో ఐక్యత, సౌహార్దం పెంపొందాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి అలై బలై తీసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## జహీరాబాద్ ఈద్గాహ్‌లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే...





**జహీరాబాద్ వెలుతురు, మార్చి 21:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఈద్గాహ్ వద్ద పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లిం మత పెద్దలు, ఈద్గాహ్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు సాదరంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ఠ, సహనం, దాతృత్వం మరియు మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనసు పవిత్రమవుతుందని, సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందుతుందని అన్నారు. మత, వర్గ భేదాలను పక్కన పెట్టి అందరూ ఐక్యంగా జీవించడం సమాజ అభివృద్ధికి అవసరమని స్పష్టం చేశారు. ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, రంజాన్ సందేశం శాంతి, సహనం, సేవాభావం వంటి గొప్ప విలువలను అందరికీ తెలియజేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ఈద్గాహ్ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## స్కూటీ దొంగతనం కేసు ఛేదించిన జహీరాబాద్ టౌన్ పోలీసులు

**జహీరాబాద్ వెలుతురు మార్చి 20:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో జరిగిన స్కూటీ దొంగతనం కేసును టౌన్ పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాబు మోహన్ కాలనీకి చెందిన నడిమిదొడ్డి వినోద్ (22) ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో జహీరాబాద్ బస్ స్టాండ్ సమీపంలో తన స్కూటీ (టీఎ 15 ఈూ 9672) ను పార్క్ చేసి, ఫోన్ పోయిందని జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదని తెలిపారు. ఈ విషయంపై ఈ నెల 19న పోలీసులకు ఫిర్యాదు అందించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే టౌన్ ఎస్ఐ కె. వినయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రైమ్ సిబ్బంది రంగంలోకి దిగి, ఘటన స్థలంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడి కదలికలను గుర్తించి, ఈ రోజు (మార్చి 21) ఉదయం 10 గంటల సమయంలో ఓల్డ్ ఆర్‌టీఓ చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా స్కూటీ నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు ఏర్పుల శ్రీనివాస్ (24), తండ్రి ఇస్మాయిల్, వృత్తి ఎలక్ట్రీషియన్, సత్వర్ గ్రామం, న్యాల్కల్ మండలం, సంగారెడ్డి జిల్లా నివాసి అని తెలిసింది. అతడే స్కూటీని దొంగిలించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, సుమారు రూ.50,000 విలువైన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోర్టు అనుమతి అనంతరం స్వాధీనం చేసిన వాహనాన్ని అసలు యజమానికి అప్పగించనున్నట్లు ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలకు డబుల్ లాక్ లేదా అలారం వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వినయ్ కుమార్ సూచించారు.

## జహీరాబాద్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు...




**జహీరాబాద్, మార్చి 21 వెలుతురు:**

జహీరాబాద్ పట్టణంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని శనివారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఈద్గాహ్ వద్ద ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ముస్లిం మైనారిటీ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రంజాన్ పండుగ మనందరిలో సోదరభావాన్ని పెంపొందించాలని, సమాజంలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు. అల్లాహ్ ఆశీస్సులు జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం మాజీ టీజీఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్‌ను కలిసి నాయకులు ప్రత్యేకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలు ముస్లిం కుటుంబాల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యునూస్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ముల్తాని, సీనియర్ నాయకులు పట్లోళ్ళ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు ఖజామియా, అరుణ్ కుమార్, జావిద్, జాఫర్, జహంగీర్, మహేష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అశ్విన్ పాటిల్, మల్లికార్జున్, ప్రమోద్ కుమార్, సందీప్ కుమార్, పాండు యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీ బడ్జెట్ 2026-27

## సంక్షేమానికి దృష్టి, అభివృద్ధికి లక్ష్యం

**హైదరాబాద్, వెలుతురు మార్చి 21:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 202627 కేవలం ఒక ఆర్థిక పత్రం కాదు; ఇది ఒక బలమైన రాజకీయ ప్రకటన, సంక్షేమ హామీ, మరియు రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన దిశను సూచించే దిశానిర్దేశం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్పించిన ఈ బడ్జెట్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, మౌలిక వసతుల అభివృద్ధి, యువత సాధికారత, మరియు ఆర్థిక క్రమశిక్షణ మధ్య సమతుల్యత సాధించాలనే సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ బడ్జెట్ యొక్క ప్రధాన బలం "ప్రజా కేంద్రిత దృక్పథం" (్రావశీజూశ్రీవ-టఱతీర్ ఖజూజూతీశీఖఎష్ట్ర). ఇది కేవలం పెద్ద ప్రకటనలకే పరిమితం కాకుండా, సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది. మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు మరియు పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఈ బడ్జెట్ యొక్క ప్రధాన లక్ష్యం. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం లక్షలాది మహిళలకు ఉపశమనం మాత్రమే కాకుండా గౌరవం మరియు స్వాతంత్ర్యాన్ని కూడా అందిస్తోంది. ఇది ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు మహిళా శక్తికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ సూచికం. ఇందిరమ్మ ఇల్లు పథకం ఈ బడ్జెట్‌లో మరో కీలక భాగంగా నిలిచింది. భూమి ఉన్న పేద కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం ద్వారా ప్రభుత్వం భద్రత, గౌరవం, స్వయం సమృద్ధి లక్ష్యాలను చేరుకోవాలనుకుంటోంది. ఒక పేద కుటుంబానికి ఇల్లు అనేది కేవలం గోడలు కాదు అది ఒక జీవితకాల స్వప్నం. ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా 1.15 కోట్ల కుటుంబాలకు 5 లక్షల బీమా కల్పించడం, రాష్ట్రం ప్రజల పట్ల చూపుతున్న బాధ్యతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఇది కష్టకాలంలో ప్రభుత్వం ప్రజల పక్కనే ఉంటుందనే విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. విద్యా రంగంలో కూడా ఈ బడ్జెట్ ప్రగతిశీల అడుగులు వేసింది. మిడ్‌డే మీల్



పథకాన్ని విస్తరించి బ్రేక్‌ఫాస్ట్‌ను కూడా అందించడం ద్వారా విద్యార్థుల ఆకలి సమస్యను పరిష్కరించడమే కాకుండా, చదువు కొనసాగింపునకు ప్రోత్సాహం లభిస్తుంది. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేసే ప్రయత్నం కనిపిస్తోంది. ఉద్యోగాలు మరియు యువత సాధికారత విషయంలో కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే వేలాది ఉద్యోగాలను కల్పించడమే కాకుండా, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ స్థాపన ద్వారా భవిష్యత్ అవసరాలకు తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఇది కేవలం ఉద్యోగాలకే కాకుండా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దే దిశగా ఒక ముందడుగు. ఆరోగ్య రంగంలో క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్, ఆసుపత్రుల విస్తరణ, డిజిటల్ ఆరోగ్య సేవలు వంటి చర్యలు ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ఈ మార్పులు ఎంతో ప్రయోజనకరంగా ఉండనున్నాయి. వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధి రంగాల్లో కూడా ఈ బడ్జెట్ ప్రాధాన్యం ఇచ్చింది. రైతులకు మద్దతు, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకంగా ఉంటాయి. అదేవిధంగా ఎస్ సి, ఎస్ టి, బిసి మరియు మైనారిటీ సంక్షేమానికి గణనీయమైన కేటాయింపులు చేయడం ద్వారా ఈ బడ్జెట్ సామాజిక న్యాయాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇది కేవలం సంక్షేమం మాత్రమే కాదు సమాన అవకాశాల దిశగా ఒక బలమైన అడుగు. మొత్తం మీద, తెలంగాణ బడ్జెట్ 202627 సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యతను కాపాడే ప్రయత్నంగా నిలిచింది. ఇది రాజకీయంగా స్పష్టమైన, సామాజికంగా బాధ్యతాయుతమైన, మరియు దీర్ఘకాలిక దృష్టితో రూపొందించిన బడ్జెట్. అయితే, ఈ బడ్జెట్ విజయవంతం కావాలంటే దాని అమలు కీలకం. ప్రకటనలు ఎంత గొప్పగా ఉన్నా, ఫలితాలు ప్రజలకు చేరినప్పుడే వాటి అసలు విలువ తెలుస్తుంది.



**డా. రేఖ బోయలపల్లి**

వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

## శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు.

శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్ఠతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు .

# మరో భారీ సైబర్ మోసం

- మోసపోయిన మాజీ డిజిపి మనవరాలు
- నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా
- ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం



**హైదరాబాద్,మార్చి21 వెలుతురు:** టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

- అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్
- రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):** మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్న అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## మనూరు మండలం బిల్లాపూర్ గ్రామంలో వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

- భక్తులకు లలితా త్రిపురసుందరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు...
- "చల్లగా చూడు తల్లి" అంటూ ఆశీర్వదించిన ఆనందగిరి మాత...



**జహీరాబాద్ వెలుతురు, మార్చి 21:** చైత్ర మాసపు పవిత్ర వసంత వేళలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు మనూరు మండలం బిల్లాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి చెందిన పూజ శ్రీ ఆనందగిరి మాత ఆశీస్సులతో ఉగాది పర్వదినాన ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపుతున్నాయి. ఈ సందర్భంగా ఆనందగిరి మాత మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. భక్తులు ఎల్లప్పుడూ అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని ఆమె కోరారు. వసంత నవరాత్రులలో భాగంగా మూడవ రోజు శనివారం అమ్మవారు లలితా త్రిపురసుందరి రూపంలో చంద్రఘంట దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై, అమ్మవారికి నిత్యార్చనలు, ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడింది. మంత్రోచ్చారణలు, భజనలు, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆనందగిరి మాతాజీ మాట్లాడుతూ వసంత నవరాత్రులు ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించే పవిత్ర కాలమని, ఈ రోజుల్లో భక్తి, నిష్ఠతో అమ్మవారిని ఆరాధిస్తే ఇష్టకామ్యాలు నెరవేరుతాయని తెలిపారు. వసంత నవరాత్రి మహోత్సవాలు శ్రీరామనవమి వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాణిక్ రావుకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఎస్ కన్స్ట్రక్షన్ ప్రతినిధులు



**జహీరాబాద్ వెలుతురు, మార్చి 21:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావుకు పలువురు ముస్లిం సోదరులు, వ్యాపారవేత్తలు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎస్ఎస్ కన్స్ట్రక్షన్ సంస్థకు చెందిన బిల్డర్స్ షేక్ షోహెబ్, షేక్ సైఫోద్దీన్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మాణిక్ రావు వారి గృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ కన్స్ట్రక్షన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ ముస్లిం సోదరి సోదరులు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ శాంతి, సహనం, సేవాభావం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సౌహార్దం పెంపొందాలని ఆయన కోరారు. అలాగే ఈద్ పర్వదినం ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలపరుస్తుందని, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. అనంతరం అక్కడి ముస్లిం సోదరులతో కలిసి అలై బలై తీసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నామ రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం గుప్తా, కళ్లెం రవి, నందు, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ లోని అర్హులైన ప్రతీ ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకాలు అందించిన నాయకులు, మన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 21:** 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన దాదాపు 16 మంది లబ్ధిదారులకు సుమారు 6.00 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో భాగంగా రెండవ రోజు జగద్గిరిగుట్ట, రంగారెడ్డి నగర్ డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్ష, నాయకుల చేతులమీదుగా పంపిణీ చేశారు.

**126 - జగద్గిరిగుట్ట డివిజన్...**

జగద్గిరిగుట్ట డివిజన్ కు చెందిన 13 మంది లబ్ధిదారులకు సుమారు రూ.4,39,500/- ల విలువ గల చెక్కులను మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానము మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు నాగరాజులు లబ్ధిదారులకు అందజేశారు.

**127 - రంగారెడ్డి నగర్ డివిజన్**

రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన 3 మంది లబ్ధిదారులకు సుమారు రూ.1,25,500/- ల విలువ గల చెక్కులను బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్, కార్తీక్ గౌడ్, బాలు నేత, ఎర్వ సాయి కిరణ్, శ్రీను లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ లోని అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే నాయకులు, మన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని, గత పన్నెండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులతో ప్రజలకు ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు అందించిన నాయకులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

**ఆదిలాబాద్,మార్చి21( వెలుతురు):** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చక్రం తిప్పుతున్న కరీంనగర్ నేతలు



**కరీంనగర్, మార్చి21( వెలుతురు):**
కరీంనగర్ అంటేనే ఉద్యమాల గడ్డ. నాడు భూస్వాములపై తిరుగుబాటు చేసినా.. తర్వాత రజాకార్లపై తిరగబడినా.. తొలితరం తెలంగాణ ఉద్యమమైనా? మలిదశ తెలంగాణ పోరాటమైనా.. జగిత్యాల జైత్రయాత్ర అయినా.. నక్సల్ ఉద్యమమైనా.. తర్వాత జరిగిన మావోయిస్టు ఉద్యమమైనా కరీనంగర్ వాసులు ఉండాల్సిందే. తాజాగా రాజకీయాల్లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిలో జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి.. దక్కుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఈ ప్రాంతం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.కరీంనగర్ నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. కీలకమైన హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ 3.0 క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసినందుకు ఆయనకు దక్కిన గుర్తింపు, గౌరవంగా చెప్పొచ్చు. ఇక తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలకమైన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సాంక్షిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.ఇక అధికాక కాంగ్రెస్‌కు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవి దక్కింది. తన పదవికి తగినట్లుగా ఆయన కార్యదక్షత చూపుతున్నారు. తాజాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కూడా విప్ పదవులు వరించాయి. దీంతో అసెంబ్లీలో కరీంనగర్ శక్తి మరింత పెరిగింది. ఇక మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ పదవులు మూడు పార్టీల్లో కరీనంగర్ జిల్లా బలాన్ని నిరూపిస్తున్నాయి.కరీంనగర్ ప్రాంతం రాజకీయంగా చురుకైన మట్టి కలిగి ఉంది. స్థానిక నాయకులు పార్టీలకు అంకితమై, గ్రామీణ?పట్టణ ప్రజల మద్దతుతో ఎదిగారు. బండి సంజయ్‌కు యువతలో మంచి పట్టు ఉంది. కేటీఆర్ టెక్నాలజీలో యువ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపు ఇస్తూ, జిల్లాను 'పవర్‌హౌస్'గా మార్చుతోంది.ప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశావహులు పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలపై ప్రెజర్ పెడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తులతో మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టులు, విప్ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బడ్జెట్ సెషన్ వేళ అసెంబ్లీ, శాసన మండలిలో విప్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

# కన్నీరు పెడుతున్న మంజీరమ్మ

**మెదక్, మార్చి21( వెలుతురు):**
సంగారెడ్డి జిల్లాలో మంజీరమ్మ కన్నీరు పెడుతోంది .ఒకప్పుడు జీవకళతో ఉట్టిపడిన నది, ఇప్పుడు పారిశ్రామిక వ్యర్థాలతో విషతుల్యంగా మారింది. ముఖ్యంగా నక్కవాగు ద్వారా వస్తున్న రసాయన జలాలు మంజీర నదిని మృత్యుకూపంగా మారుస్తున్నాయి. హత్నూర మండలం పల్వనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల పరిసరాల్లో వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. వేల సంఖ్యలో చేపల మృతితో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.సంగారెడ్డి జిల్లా మత్స్యకారుల బతుకు చిత్రం ఛిన్నాభిన్నమవుతోంది. నక్కవాగు రూపంలో వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు మంజీర నదిని కలుషితం చేస్తున్నాయి. పారిశ్రామిక వాడల నుండి వెలువడే రసాయన జలాలను నేరుగా వాగులోకి వదలడంతో, ఆ విషతుల్యమైన నీరు మంజీరలో కలిసి మత్స్య సంపదను హరించివేస్తోంది. నేడు చేపల వేటకు వెళ్లిన పల్వనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల గ్రామస్థులకు నదిలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న మృత చేపలు దర్శనమిచ్చాయి..గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. చేపలు చనిపోయిన ప్రతిసారీ అధికారులు వస్తారు, నమూనాలు సేకరిస్తారు. కానీ యాక్షన్ మాత్రం శూన్యమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవాగు పరిసర గ్రామాల ప్రజలు ఈ నీటిని తాగలేక, వాడలేక నానా అవస్థలు పడుతున్నారు. కంపెనీల యాజమాన్యాలు లాభాల కోసం చూస్తూ, వ్యర్థాలను శుద్ధి చేయకుండానే నదిలోకి వదులుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఈ కాలుష్య కోరల నుండి మంజీరను కాపాడేవారే లేరా అని ప్రశ్నిస్తున్నారు.

# టీజేపీకి లైన్ క్లియర్



**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇప్పుడు సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నమోదు ప్రక్రియను కవిత ప్రారంభించారు. సాధారణంగా రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో సాగుతుంది. అయితే, తన దరఖాస్తుపై ఈసీఐ వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత. ఫిబ్రవరి 23న దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఈసీఐ తిరుగు టపా పంపింది. మార్చి 19న దిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్‌పై కీలక విచారణ జరగనుంది. ఈ న్యాయపోరాటం ద్వారా పార్టీని సాధ్యమైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.గతంలో 'తెలంగాణ జాగృతి' అనే సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడంలో కవిత విజయవంతమయ్యారు. ఇప్పుడు దాదాపు అదే పేరును రాజకీయ పార్టీగా మార్చడం వెనుక సెంటిమెంట్, బ్రాండ్ వాల్యూ రెండూ ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి ప్రాతిపదికన తన రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలనేది ఆమె ఆలోచనగా కనిపిస్తోంది.పార్టీ నమోదు విషయంలో ఈసీఐ లేవనెత్తిన లోపాలు ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. రాజకీయ పార్టీ నమోదుకు ఉండాల్సిన నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నిధుల సమీకరణ, పార్టీ రాజ్యాంగం, సభ్యత్వ వివరాల్లో స్పష్టత ఉండాలి. హైకోర్టు ఈ విషయంలో ఈసీఐకి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ నీడలో కాకుండా, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ వేదిక ఉండాలని ఆమె ఆశిస్తున్నారు. మహిళా సాధికారత, తెలంగాణ హక్కులే ప్రధాన ఎజెండాగా ఈ పార్టీ పనిచేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె ఎదుర్కొంటున్న లిక్కర్ స్కామ్ కేసుల నేపథ్యంలో, రాజకీయంగా యాక్టివ్‌గా ఉండటం ద్వారా ఆ ఆరోపణలను ఎదుర్కోవాలని ఆమె యోచిస్తున్నారు. జాగృతి సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌ను నేరుగా రాజకీయ శక్తిగా మార్చడం ఈ పార్టీ ఉద్దేశ్యం'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. యితే సాంకేతిక లోపాలను సవరించుకోకుండా.. కవిత కోర్టుకు వెళ్లడం ఏమిటన్న విస్మయం వ్యక్తమవుతోంది. ఆ సాంకేతిక లోపాలు పరిష్కరించలేనివి అయితే తప్ప ఇలా చేయరని.. భావిస్తున్నారు. కవిత ఇప్పుడు ఆ సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటే తప్ప.. రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎలాగోలా నెల రోజుల్లో పూర్తి చేసి తన పార్టీని ప్రకటించాలని కవిత ప్రయత్నిస్తున్నారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు ఇది అనుబంధ శక్తిగా మారుతుందా లేదా కవిత స్వతంత్ర గళాన్ని వినిపిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి దిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఈ కొత్త పార్టీ ప్రస్థానానికి పునాది కానుంది.

## రేవంత్ వ్యూహాల ముందు...
# కేటీఆర్ ఆత్మరక్షణ




**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు.ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్-2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు.ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేక పోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరపున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది. రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమేనని స్పష్టమవుతోంది.

# అన్నాఅలా... తమ్ముడు ఇలా...



**నల్గొండ, మార్చి21( వెలుతురు):**
కోమటిరెడ్డి బ్రదర్స్. తెలంగాణ పాలిటిక్స్‌లో ఇదో ట్యాగ్ లైన్. అందుకు తగ్గట్లు వారు కూడా ఓ బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. కానీ ఆ అన్నదమ్ముళ్ల తీరే సమ్‌థింగ్ డిఫరెంట్. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు. వెంకట్‌రెడ్డి ఆల్రెడీ మంత్రిగా ఉన్నారు. ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖలు నిర్వహిస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి అమాత్య యోగం దక్కట్లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారు. సీఎం రేవంత్ టార్గెట్‌గా బాణాలు ఎక్కుపెడుతున్నారు. ఈ క్రమంలో ఆ బ్రదర్స్ రూటు సెపరేటు అయిపోయింది. వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌కు పాజిటివ్ వాయిస్ వినిపిస్తూనే అప్పుడప్పుడు ట్విస్టులు ఇస్తున్నారు. ఇక రాజగోపాల్‌రెడ్డి మాత్రం మంత్రి పదవి దక్కే వరకు తగ్గేదేలే అన్నట్లుగా అసంతృప్తి సెగ రాజేస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు బ్రదర్స్ తీరు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌కు కంట్లో నలుసులా..కొరకరాని కొయ్యలా తయారైందట.కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..సినిమా అవార్డుల ప్రదానోత్సవానికి డుమ్మా కొట్టడం హాట్ టాపిక్‌గా మారింది. గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్‌లో కోమటిరెడ్డి కనిపించకపోవడం చర్చనీయాంశం అవుతోంది. కోమటిరెడ్డి తన శాఖను గాలికి వదిలేసి..లేనిపోని ఇష్యూల జోలికి వెళ్తున్నారన్న గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. అసలు తన శాఖలో జరిగే వ్యవహారాలు తనకు తెలియదన్నట్లుగా అప్పుడప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారి తీస్తున్నారాయన.సినిమా టికెట్ల రేట్ల పెంపుతో తనకు సంబంధం లేదని ఓసారి..ఇక నుంచి ఏ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు ఉండదని మరోసారి పొంతన లేని వ్యాఖ్యలు చేసిన ఆయన ఇప్పుడు ఇంకో ట్విస్ట్ ఇచ్చారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..ఏకంగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు కాలేదు. అయితే బిజీగా ఉండటం వల్లే రాలేదా? లేక వెంకట్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నారా? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇంతకంటే రెండ్రోజుల ముందే జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా చేయాలని ఓ గత్తర లేపారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. జగ్గారెడ్డి మరో పీజేఆర్ అని..ఆయన లాంటి మాస్ లీడర్‌ను టీపీసీసీ చీఫ్‌గా నియమిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయంటూ చర్చకు తెరలేపారు. దీంతో వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లోని బీసీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోందట.ఇక ఇప్పటికే మంత్రి పదవి విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తుందని అంటుంటారు. వెంకట్‌రెడ్డిని తప్పిస్తే తప్ప రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదన్న అభిప్రాయంలో అధిష్టానం ఉందంటున్నారు. అయితే వెంకట్‌రెడ్డే మంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నారట రేవంత్. రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపట్లేదట. ఇదే రాజగోపాల్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌కు కారణమంటున్నారు. ఈ క్రమంలోనే అన్నదో దారి అయితే..తమ్ముడిది మరో దారి అన్నట్లుగా మారిపోయిందని అంటున్నారు.ట్రిపుల్ ఆర్ రోడ్డు విషయంలో నిర్వాసితుల పక్షాన రాజగోపాల్‌రెడ్డి వాయిస్ వినిపిస్తే..రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేయడం తన టార్గెట్ అంటూ చెప్పుకుంటూ వస్తున్నారు వెంకట్‌రెడ్డి. ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలంటూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారాయన. ఇక నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత నియామకంపై వెంకట్‌రెడ్డి సుర్రుబుర్రులాడితే..రాజగోపాల్‌రెడ్డి కైలాష్ నేతకు పగ్గాలు అప్పజెప్పడాన్ని స్వాగతించారు. ఇక సీఎం రేవంతే ఇంకో పదేళ్లు సీఎంగా ఉండాలని ఆకాంక్షిస్తూ..దేవుడ్ని కోరుకున్నాని వెంకట్‌రెడ్డి చెప్తే..తానే సీఎం అని రేవంత్ ఎలా చెప్పుకుంటారంటూ అటాక్ చేశారు రాజగోపాల్‌రెడ్డి. తనకు మంత్రి పదవి ఇవ్వట్లేదన్న అసంతృప్తితో పలువురు ఎమ్మెల్యేలతో రాజగోపాల్‌రెడ్డి డిన్నర్ మీటింగ్ నిర్వహించారన్న టాక్ కూడా అధికార పార్టీని కలవరపెడుతోంది.ఇలా ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా.. చెరో తీరు స్పందిస్తూ అన్నదమ్ముళ్లు సీఎం రేవంత్‌కు కొరకరాని కొయ్యలా మారారాన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కరువమంటే కప్పుకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా..కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరి మాట వినే పరిస్థితి లేదట. పైగా తీరు మార్చుకోమని చెప్పే సాహసం కూడా ఎవరూ చేయట్లేదట. దీంతో వాళ్లిద్దరి తీరుతో సీఎం రేవంత్ విసిగిపోయారని ఇన్ సైడ్ టాక్. వెంకట్‌రెడ్డి వ్యవహార శైలి మారేదెప్పుడో? రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి చల్లారేదెప్పుడో చూడాలి.

## సూపర్ గేమ్ ఛేంజర్‌గా
# రీజనల్ రింగ్ రోడ్




**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**
హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 161.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారిపై ఏఐ కెమెరాలు, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందేలా పోలీసు, రవాణా శాఖలను అప్రమత్తం చేస్తుంది.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సగం తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ సూపర్ గేమ్ ఛేంజర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కేంద్రం జాతీయ నంబర్‌ను కూడా కేటాయించి పనుల కోసం టెండర్లు ఆహ్వానించింది. ఇక ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఏఐ టెక్నాలజీతో ఈ భాగం పనులు చేపట్టాలని సర్కార్ భావిస్తోంది.ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఏఐ ఆధారిత అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. ఈ క్రమంలో తెలంగాణలో ప్రారంభించనున్న కొత్త ఎన్‌హెచ్ఏఐ రహదారులకు ఇదే తరహా టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనుల్లో ఈ టెక్నాలజీ వినియోగించడంపై కేంద్రం ఫోకస్ సారించింది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగడ్‌పల్లి వరకు 161.5 కిలోమీటర్ల ఆరు వరుసలతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారి వెంట ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించడానికి ఎన్‌హెచ్ఏఐ తాజాగా ఏర్పాట్లు చేస్తోంది. దాంతో పాటుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 4నుంచి 6 వరుసలుగా మార్చడానికి ఇప్పటికే డీపీఆర్ సమర్పించారు. ఇందులో మొత్తం 232 కిలోమీటర్ల పొడవున సాంకేతికతను ఉపయోగించాలని డిసైడ్ అయ్యారు.ఇందులో భాగంగా అడ్వాన్స్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా తెలంగాణ, ఏపీలోని పోలీసు, రవాణా శాఖలతో రోడ్డు భద్రతను అనుసంధానం చేస్తారు. హైదరాబాద్-నాగ్‌పుర్ మార్గంలోనూ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణ పరిధిలో ఈ రహదారి మొత్తం 251 కిలోమీటర్ల మేర ఉండగా పూర్తిస్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం తీసుకురానున్నారు. ఈ ఏఐ టెక్నాలజీలో భాగంగా రహదారి వెంట అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తారు. ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తే ఈ కెమెరాలు పట్టేస్తాయి. వెంటనే ఆ వాహనదారుడి అడ్రస్‌కు ఆటోమెటిక్‌గా చలాన్లు వెళ్తాయి. దాంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే అలర్ట్ కావటానికి వైద్య సహాయం అందించటానికి వీలు కలుగుతుంది.

# పొలిటిక్స్ లోకి నారా రోహిత్...



**తిరుపతి, మార్చి21( వెలుతురు):**
తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు నందమూరి, నారా కుటుంబాల వారివి. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకు రాగలిగారు నందమూరి తారక రామారావు. అయితే చంద్రబాబు ఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగాను వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల పాటు ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు పాత్ర మరువరానిది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి భవిష్యత్తు నాయకుడు లోకేష్ అనడంలో సందేహం లేదు. తనను తాను ప్రూవ్ చేసుకొని ముందుకు సాగుతున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీని అనధికారిక అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పార్టీని సమన్వయం చేసుకోవడమే కాదు బలోపేతం చేయడంలో లోకేష్ ముందుంటున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు నారా కుటుంబం నుంచి మరో యువ నేత రంగంలోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. సినీ నటుడు నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు బలం చేకూరుస్తూ ఆయన సైతం ఫుల్ క్లారిటీ ఇచ్చారు.చంద్రబాబు నాయుడుసోదరుడిగా రామ్మూర్తి నాయుడు ఉండేవారు. ఆయన ఒకసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. చాలా రోజులపాటు అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది చనిపోయారు రామ్మూర్తి నాయుడు. ఆయన కుమారుడే నారా రోహిత్. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. అయితే ఇంతవరకు ఆయనకు సినిమా రంగంలో సరైన బ్రేక్ తగలలేదు. మొన్ననే వివాహం చేసుకొని ఒక ఇంటి వాడు అయ్యాడు. అయితే తనకు రాజకీయ ఆసక్తి ఉందని తాజాగా వెల్లడించాడు. నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలు ఆయన సొంత గ్రామం నారావారి పల్లెలో జరిగాయి. తండ్రికి నివాళులు అర్పించేందుకు నారా రోహిత్ వెళ్లారు. పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు అడిగితే.. కచ్చితంగా ఉంటుందని ఆయన చెప్పారు. తనకు రాజకీయాలు అంటే ఇష్టంగా పేర్కొన్నారు. సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తానని కూడా చెప్పుకొచ్చారు.నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యానికి గురికావడంతో నారా రోహిత్ బాధ్యతలను ఎక్కువగా చంద్రబాబు చూసుకున్నారు. ఆయన పొలిటికల్ గా బిజీగా ఉండడంతో పెద్దమ్మ భువనేశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొన్న రోహిత్ వివాహంలో కూడా భువనేశ్వరి అన్ని తానై వ్యవహరించారు. పెదనాన్న చంద్రబాబు, సోదరుడు లోకేష్ తో రోహిత్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా రోహిత్ ప్రచారం కూడా చేశారు. లోకేష్ తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే కుటుంబ పరంగా ఆయనకు మద్దతు అవసరం. అందుకే నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన చంద్రగిరి నుంచి బరిలో దిగుతారని నారా అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లోనే కాకుండా పార్టీ పరంగా కూడా నారా రోహిత్ సేవలను టిడిపి నాయకత్వం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పెదనాన్న చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం టిడిపిలో యాక్టివ్ అయ్యేందుకు నారా రోహిత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# జగన్‌కు మారుతున్న వ్యూహకర్తలు

**విజయవాడ, మార్చి21( వెలుతురు):**



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం తన రాజకీయ ప్రస్థానంలో అత్యంత కీలకమైన వ్యూహకర్తల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, పార్టీని గాడిలో పెట్టేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. 2019లో అఖండ విజయానికి కారకుడైన ప్రశాంత్ కిషోర్‌ను దూరం చేసుకున్న ఐప్యాక్ పై భారం వేసిన జగన్, ఫలితాల తర్వాత వారిని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎన్నికలకు ముందు ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి మనం సుదీర్ఘ కాలం కలిసి ప్రయాణం చేద్దాం అని చెప్పిన జగన్, ఫలితాల షాక్‌తో నిర్ణయాన్ని మార్చుకున్నరా?.ఐప్యాక్ నిష్క్రమణ తర్వాత వైసీపీ శిబిరంలో పలువురు వ్యూహకర్తల పేర్లు వినిపించాయి. ముఖ్యంగా బీజేపీ కోసం పనిచేసిన అనుభవం ఉన్న శంతను సింగ్ వంటి వారిని లైన్‌లోకి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మరికొందరు జాతీయ స్థాయి కన్సల్టెంట్లను సంప్రదించినా, జగన్ తీరు , ఆయన ఆలోచనా విధానానికి అనుగుణంగా ఎవరూ ఇమడలేకపోతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. తాజాగా ఈషా సింగ్ అనే యువ వ్యూహకర్త పేరు తెరపైకి వచ్చింది. ఈమె గతంలో పలువురు ప్రముఖులకు సోషల్ మీడియా, పొలిటికల్ బ్రాండింగ్ విభాగాల్లో పనిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నేతృత్వంలో వైసీపీకి కొత్త ఇమేజ్ ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.జగన్ మోహన్ రెడ్డి మనస్తత్వం ప్రకారం ఆయన ఒకసారి నమ్మితే పూర్తి బాధ్యతలు అప్పగిస్తారు, కానీ ఆశించిన ఫలితాలు రాకపోతే అంతే వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆయనకు కేవలం డేటా మాత్రమే కాదు, తన వ్యక్తిత్వాన్ని , క్షేత్రస్థాయి క్యాడర్ భావోద్వేగాలను ప్రతిబింబించే వ్యూహాలు కావాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యూహకర్తలు కేవలం సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు పరిమితమవుతున్నారే తప్ప, ప్రత్యర్థి కూటమిని ఢీకొట్టే బలమైన రాజకీయ అజెండాను సృష్టించడంలో విఫలమవుతున్నారనే అభిప్రాయం ఉంది.ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో, కొత్తవారు ఎవరూ నిలదొక్కుకోలేకపోతుండటంతో.. వైసీపీ చివరకు తన పాత మిత్రుడు ప్రశాంత్ కిషోర్ వైపే మళ్ళీ మొగ్గు చూపే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పట్లో పీకే ఇచ్చిన క్షేత్రస్థాయి రిపోర్టులు, అభ్యర్థుల ఎంపికలో ఆయన సలహాలు జగన్‌కు బాగా కలిసి వచ్చాయి. ఒకవేళ కొత్త టీమ్‌లు ఆశించిన స్థాయిలో పార్టీని పుంజుకునేలా చేయలేకపోతే, రాబోయే రోజుల్లో మిషన్ 2029 కోసం జగన్ మళ్ళీ పీకే శిబిరాన్ని ఆశ్రయించినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. అయితే పీకే ఆసక్తి చూపిస్తారా అన్నది మాత్రం చెప్పడం కష్టమే.

# వార్నింగ్ లతో సరి...


**విజయవాడ, మార్చి21( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో టీడీపీ వ్యవహార శైలి పై ఇటీవల చర్చలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ నేతల ప్రవర్తనపై ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మృదువైన వైఖరిని అవలంబిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకులు దారి తప్పుతున్నారని సమీక్షలు నిర్వహించడం, వారిని హెచ్చరించడం వరకే పరిమితమవుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల ఏలూరు ( ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వ్యవహారం ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది. ఇప్పటికే 2024లో డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఆయనపై మరోసారి అదే విధమైన ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికర పరిస్థితిని తీసుకొచ్చింది. గతంలో కూడా ఈ విషయంపై సీరియస్‌గా స్పందించినట్టు ప్రకటించినప్పటికీ, వాస్తవానికి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తోంది.చంద్రబాబు పాలనలో విజన్, అభివృద్ధి, పారదర్శకత వంటి అంశాలు ప్రాధాన్యం పొందుతున్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మాత్రం క్రమశిక్షణ లోపిస్తున్నదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఎంపీలు మధ్య విభేదాలు బయటపడటం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది.ఈ పరిస్థితుల్లో కనీసం ఒక నాయకుడిపై అయినా కఠిన చర్యలు తీసుకుని ఉదాహరణ చూపించాల్సిన అవసరం ఉందని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. కానీ ప్రతి సారి “హెచ్చరించాం” అనే ప్రకటనలతో సరిపెట్టుకోవడం సమస్యను మరింత పెంచుతోందని అంటున్నారు. ఈ విధానం వల్ల నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోవాలనే ఒత్తిడి అనుభవించడంలేదని కూడా అభిప్రాయపడుతున్నారు.ఇదే సమయంలో ప్రతిపక్షం వైసీపీ పై దాడి చేయాల్సిన పరిస్థితుల్లో, తమ పార్టీ లోపాలే ముందుకు రావడం టీడీపీకి ఇబ్బందిగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ పనితీరు గురించి చెప్పుకోవాల్సిన సమయంలో, మరోవైపు నాయకుల వివాదాలు చర్చకు రావడం వల్ల పార్టీ ఇమేజ్‌పై ప్రభావం పడుతోంది.సీనియర్ నాయకులు సూచిస్తున్నది ఏమిటంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే క్రమశిక్షణను పునరుద్ధరించవచ్చని. సంఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నియంత్రణ చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే, టీడీపీకి ప్రస్తుతం ఉన్న సవాలు కేవలం రాజకీయ ప్రత్యర్థులతో మాత్రమే కాదు, పార్టీ అంతర్గత వ్యవహారాలను సరిచేసుకోవడంలో కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో నాయకత్వం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీ దిశను నిర్ణయించే అవకాశముంది.

# కోటి రూపాయల అటెండన్స్ వివాదం

**హైదరాబాద్, మార్చి21( వెలుతురు):**



సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ‘వర్క్ ఫ్రమ్ హోమ్’ ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే “అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి” గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. ‘రాజ్యం పోయినా రాచరికం పోలేదు’ అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ ‘రాజకీయం’ చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. “కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం” అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో ‘తెలంగాణ రైజింగ్ 2047’ అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం “మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు” అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ఎఐ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. “మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు” అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక “మాయని మచ్చ” అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది ‘కళ’ అయితే.. అందులో కేసీఆర్ గారు ‘ఆస్కార్’ రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ ‘కోటి రూపాయల అటెండెన్స్’ వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!

# ఆస్తుల లొల్లికి ఫుల్ స్టాప్... కామానా....

**విజయవాడ, మార్చి21( వెలుతురు):**



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల చిచ్చు మరోసారి బహిర్గతమైంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ శుక్రవారం ఒక కీలక అఫిడవిట్‌ను దాఖలు చేశారు. “ వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదు.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని ఆమె ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టం చేశారు. విజయమ్మ తన అఫిడవిట్‌లో జగన్ వాదనలను పూర్తిగా తప్పుపట్టారు. 2009లో వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే . ఆస్తుల పంపకం ఎప్పుడూ అధికారికంగా జరగలేదన్నారు. తన మనవలు, మనవరాళ్లు నలుగురికి ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఉద్దేశ్యం, ఆజ్ఞ అని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, ఎంఓయూ లో లేని బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, అది వైఎస్సార్ ఆజ్ఞ అని తెలిపారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అంటే షర్మిల పిల్లలకు అన్యాయం చేశాడని, ఇప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ అఫిడవిట్‌ను వైఎస్ విజయమ్మ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో సమర్పించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల బదిలీకి సంబంధించి జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ పత్రాన్ని నోటరీ చేయించి, అధికారికంగా ట్రిబ్యూనల్‌కు అందజేశారు.షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందంటూ జరుగుతున్న ప్రచారాన్ని విజయమ్మ తీవ్రంగా ఖండించారు. షర్మిల వద్ద ఉన్న ఆస్తులు జగన్ ఇచ్చినవి కావు, అవి ఆమెకు రావాల్సిన వాటా మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే తనను బినామీగా చిత్రీకరించవద్దని, దేవుడి సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని మీడియాను వేడుకున్నారు.గతంలో వైఎస్ జగన్, షర్మిల మధ్య జరిగిన ఎంఓయూ ప్రకారం కొన్ని ఆస్తులను బహుమతిగా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. వైఎస్ ఫ్యామిలీ ఆస్తులపై ఇంటాబయటా పెద్ద రచ్చ జరుగుతోంది. పలువురు వైసీపీ నేతలు ఈ అంశంపై ప్రెస్ మీట్లు పెట్టి షర్మిలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫిడవిట్ ద్వారా ఆస్తులపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఇప్పటివరకు అసలు జరగలేదని ఆమె కుండబద్దలు కొట్టారు. జగన్ ఎంవోయూరాసింది కూడా షర్మిల హక్కును గుర్తించేనని, అది ఏమాత్రం దానం కాదని ఆమె స్పష్టం చేశారు.వైసీపీ నేతలు మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని విజయమ్మ గోబెల్స్ ప్రచారంగా అభివర్ణించారు. షర్మిలకు జగన్ వేల కోట్లు ఇచ్చారని ప్రచారం చేయడంపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇచ్చిన డబ్బు ఆస్తి పంపకం కాదని, వ్యాపార లాభాల నుంచి ఇచ్చిన డివిడెండ్ మాత్రమేనని ఆమె క్లారిటీ ఇచ్చారు.“నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి తెలుసు” అని అనడం ద్వారా విజయమ్మ ఒక తల్లిగా జగన్ మనస్సాక్షిని తట్టిలేపే ప్రయత్నం చేశారు. తన మేనల్లుడికి, మేనకోడలికి (షర్మిల పిల్లలకు) జగన్ అన్యాయం చేస్తున్నాడని ఆవేదన చెందారు. సరస్వతి సిమెంట్స్‌తో పాటు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ కూడా షర్మిలదేనని ఆమె తేల్చి చెప్పారు.రాజకీయ ప్రయోజనాల కోసం తన కుటుంబాన్ని వాడుకోవద్దని ఆమె మీడియాను కోరారు. అసత్యాలు ప్రచారం చేస్తున్న వారెవరైనా సరే, దేవుడి న్యాయమే అంతిమమని ఆమె పేర్కొనడం ద్వారా నైతిక పైచేయి సాధించే ప్రయత్నం చేశారుఈ అఫిడవిట్ ద్వారా విజయమ్మ ఒక ముఖ్యమైన సాక్షిగా మారారు. రేపు కోర్టులో ఆస్తుల వివాదం నడిచినప్పుడు, వైఎస్సార్ బతికున్నప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె చెప్పిన మాటలు జగన్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. షర్మిల ఒంటరిగా పోరాడుతుందనే భావన కలగకుండా, కుటుంబ పెద్దగా విజయమ్మ ఆమె పక్షాన నిలిచారు. వైఎస్సార్ ఆశయం ప్రకారం నలుగురు మనవలకు సమాన వాటా దక్కాలనే పాయింట్‌ను ఆమె బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.“దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలే” అని ముగించడం ద్వారా విజయమ్మ ఈ వివాదానికి అత్యున్నత ప్రాధాన్యతను ఇచ్చారు. అధికార బలంతోనో, అబద్ధపు ప్రచారాలతోనో గెలవాలని చూసేవారికి ఆమె పరోక్షంగా చురకలు అంటించారు. వైఎస్ కుటుంబంలో ఆర్థిక చిచ్చు ఇప్పట్లో తగ్గేలా లేదు. వైయస్ కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ తాజాగా వేసిన అఫిడవిట్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారుతుంది. తన సొంత కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి.. తన మనవలైన షర్మిల పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడంటూ ఆమె నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో అఫిడవిట్ దాఖలు చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంతవరకు ఆస్తుల పంపకం జరగలేదని.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని ఆమె తేల్చి చెప్పారు. తన నలుగురు మనవలు, మనవరాళ్లకు ఆస్తులను సమానంగా పంచాలన్నదే రాజశేఖర్ రెడ్డి ఆఖరి కోరికగా, ఆజ్ఞగా ఆమె గుర్తు చేశారు. కొంతకాలంగా వైఎస్ కుటుంబంలో ఆస్తి వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు ఇతర ఆస్తుల విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విజయమ్మ తన కుమార్తె షర్మిలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్మోహన్ రెడ్డి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. తన తల్లి షేర్ ను చెల్లెలు షర్మిల దక్కించుకోవడంపై పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గత కొద్దిరోజులుగా వాదనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫీడవిట్ దాఖలు చేశారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి దక్కాల్సిన వాటాలు ఇవ్వకుండా మోసం చేయడం పై విజయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు యలహంక ఇల్లు కూడా షర్మిల దేనని.. ఇది వైయస్సార్ స్వయంగా ఇచ్చిన ఆదేశమని ఆమె స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కారణాలతో లేదా ఇతర విభేదాలతో తన చెల్లెలి పిల్లలకు రావాల్సిన ఆస్తులను జగన్ అడ్డుకోవడం ధర్మం కాదని ఆమె ఆ ప్రత్యేక న్యాయస్థానానికి పేర్కొన్నారు. షర్మిల అడుగుతోంది కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమెకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటాయే తప్ప.. జగన్ ఇచ్చే బహుమతి కాదని కూడా తేల్చి చెప్పారు.జగన్ తన తల్లి మాటలను మన్నించి తన సోదరికి న్యాయం చేస్తారా? లేక ఈ వివాదం రాజకీయ రచ్చగా మారుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే, రాజకీయ కారణాలు, ఇతర విభేదాల వల్ల ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించగా, అది తన హక్కు అని షర్మిల వాదిస్తున్నారు. ఇప్పుడు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగి షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

# జనసేనతో బాలినేని.. కొలిక్కి వచ్చినట్టేనా..

**ఒంగోలు, మార్చి21( వెలుతురు):**

ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చుట్టూ గత కొద్దిరోజులుగా నడుస్తున్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. ఆయన జనసేనను వీడి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) గూటికి చేరుతారనే ప్రచారానికి పవన్ కల్యాణ్‌తో జరిగిన భేటీతో చెక్ పడింది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ‘ఒంగోలు గిత్త’గా పేరుగాంచిన బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎన్నికల అనంతరం వైసీపీని వీడి జనసేనలో చేరడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, గత వారం రోజులుగా ఆయన పార్టీ మారుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో, ముఖ్యంగా వైసీపీ అనుకూల మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారమయ్యాయి.వార్తా సేవబాలినేని వైసీపీని వీడి జనసేనలో చేరినప్పటికీ, పాత పార్టీ నేతలతో ఆయనకు ఉన్న సంబంధాలు, ప్రకాశం జిల్లాలో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయన అసంతృప్తిగా ఉన్నారనే వార్తలు పుట్టుకొచ్చాయి. “బాలినేని మళ్ళీ సొంత గూటికి” అనే శీర్షికలతో వైసీపీ సోషల్ మీడియా విభాగం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. జగన్ మోహన్ రెడ్డి పట్ల ఆయనకు ఉన్న సానుకూలతను అస్త్రంగా చేసుకుని, ఆయన జనసేనలో ఇమడలేకపోతున్నారనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది.అయితే అలాంటి ఊహాగానాలకు ముగింపు పలుకుతూ బుధవారం బాలినేని శ్రీనివాస రెడ్డి



మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి కూడా పాల్గొనడం విశేషం. కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాకుండా, జిల్లా రాజకీయాలు, భవిష్యత్తు కార్యాచరణపై పవన్‌తో ఆయన సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇవాళ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన విడుదల చేసిన పోస్టర్లలో పవన్ కల్యాణ్ ఫోటోను ప్రముఖంగా ఉంచడం ద్వారా, తాను జనసేనలోనే కొనసాగుతున్నాననే స్పష్టమైన సందేశాన్ని కేడర్‌కు, ప్రత్యర్థి పార్టీలకు పంపారు.బాలినేని పార్టీ మారుతున్నారనేది వైసీపీ ఆడుతున్న ‘మైండ్ గేమ్’ అని ఆయన వర్గీయులు చెప్తున్నారు. జిల్లాలో జనసేన బలపడకుండా చూసేందుకు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకే ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఒక సీనియర్ నేత పార్టీ మారి, మళ్ళీ వెనక్కి వస్తున్నారనే ప్రచారం ద్వారా జనసేన ప్రతిష్టను తగ్గించాలనుకుంటున్నారని చెప్తున్నారు. బాలినేని వెంట వచ్చిన అనుచరుల్లో అభద్రతా భావాన్ని నింపాలనుకుంటున్నారనేది వారి ఆరోపణ.వార్తా సేవప్రకాశం జిల్లాలో బాలినేనికి బలమైన కేడర్ ఉంది. ఆయన జనసేనలో ఉండటం కూటమికి పెద్ద ప్లస్ పాయింట్. ఒకవేళ ఆయన నిజంగానే వెనుదిరిగితే జిల్లాలో జనసేన డీలా పడే అవకాశం ఉండేది. కానీ, తాజా భేటీతో జనసైనికుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. పవన్ కల్యాణ్ కూడా బాలినేని అనుభవాన్ని జిల్లా అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి వాడుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. కానీ, ఒక నాయకుడి వ్యక్తిగత నిర్ణయాలపై సాగే తప్పుడు ప్రచారం తాత్కాలికంగా గందరగోళం సృష్టించినా, వాస్తవాలు వెలుగులోకి వచ్చినప్పుడు అది సదరు ప్రచారం చేసిన పార్టీకే నష్టం చేకూరుస్తుంది. బాలినేని శ్రీనివాస రెడ్డి పవన్ కల్యాణ్‌ను కలవడంతో ప్రకాశం జిల్లా రాజకీయాల్లో నెలకొన్న నీలినీడలు తొలగిపోయాయి. ఆయన తన రాజకీయ భవిష్యత్తును జనసేనతోనే ముడివేసుకున్నారని ఈ భేటీతో రూఢీ అయింది.

# మంగళగిరి మోడల్ సాధ్యమేనా

**గుంటూరు మార్చి21( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, మంత్రి నారా లోకేష్ తన పనితీరుతో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సంక్షేమం విషయంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, లోకేష్ సృష్టిస్తున్న ఈ స్టాండర్డ్ ను అందుకోవడంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం వెనుకబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నారా లోకేష్ మంగళగిరిలో కేవలం ఒక ఎమ్మెల్యేగా కాకుండా, ఒక వ్యవస్థగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మంత్రిగా రాష్ట్రస్థాయి బాధ్యతల్లో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అటు ఐటీ, విద్యాశాఖల మంత్రిగా సచివాలయంలో ఫైళ్లను క్లియర్ చేస్తూనే, ఇటు మంగళగిరిలోని పాఠశాలలకు ఆకస్మిక తనిఖీలకు వెళ్లడం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం వంటి చర్యల ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలమైన ముద్ర వేస్తున్నారు. పర్యటనల్లో ప్రోటోకాల్ ఆడంబరాలు లేకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యకు వెళ్లడం ఆయన పనితీరులోని ప్రత్యేకత.లోకేష్ తనను తాను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకుంటున్న తరుణంలో, టీడీపీలోని చాలామంది ఎమ్మెల్యేలు మాత్రం పాత ధోరణిలోనే సాగుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి కంటే వ్యక్తిగత




ఆధిపత్యం, స్థానిక వివాదాలు మరియు కాంట్రాక్టుల చుట్టూ కొందరు నేతలు తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లోకేష్ తరహాలో టెక్నాలజీని వాడుకోవడం లేదా సోషల్ మీడియా ద్వారా ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉండటం వంటి అంశాలను వీరు లైట్ తీసుకుంటున్నారు. ఫలితంగా, కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకుంటున్నారు.లోకేష్ పనితీరును అందరూ అనుసరించాలని టీడీపీ హైకమాండ్ బహిరంగంగా ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలను మోటివేట్ చేయడంలో మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. బహుశా సీనియర్ ఎమ్మెల్యేల పనితీరును ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో అధిష్టానం ఉందేమో కానీ, లోకేష్ సాధిస్తున్న ఫలితాలను చూసైనా నేతలు మారాలన్న ఒత్తిడి క్యాడర్ నుంచి పెరుగుతోంది. లోకేష్ తన శాఖల్లో చూపిస్తున్న వేగాన్ని పార్టీ యంత్రాంగం మొత్తం అందిపుచ్చుకోలేకపోవడం ఒక లోపంగా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఇప్పుడు వ్యక్తిగత ఇమేజ్ కంటే ప్రజాబలం ముఖ్యం. లోకేష్ తన ఇమేజ్‌ను మంగళగిరిలో చేసిన సేవా కార్యక్రమాల ద్వారా పెంచుకున్నారు. కానీ, చాలామంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తారన్న ముద్రను చెరిపేసుకోలేకపోతున్నారు. లోకేష్ సెట్ చేసిన స్టాండర్డ్స్ ఒక రకంగా టీడీపీ నేతలకు సవాల్‌గా మారాయి. ఆయన వేగాన్ని తట్టుకుని నిలబడాలంటే, ఎమ్మెల్యేలు తమ పనితీరును సమూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నారా లోకేష్ ఇప్పుడు ‘నెక్ట్స్ జనరేషన్’ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. కేవలం లోకేష్ ఒక్కరు కష్టపడితే సరిపోదని, పార్టీలోని ఎమ్మెల్యేలందరూ అదే స్థాయిలో కష్టపడితేనే 2029 ఎన్నికల నాటికి టీడీపీ మళ్ళీ తిరుగులేని శక్తిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి లోకేష్‌ను చూసి ఈ ఎమ్మెల్యేలు ఎప్పుడు చక్కబడతారో వేచి చూడాలి.

# విజయ్ ఆంటోని 'వంద దేవుళ్లు' ఫస్ట్ లుక్ అదిరింది..

హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) మార్చ్ 21 :





విజయ్ ఆంటోనీ హీరోగా శశి దర్శకత్వంలో 'నూరు సామి' అనే చిత్రం తెరకెక్కుతోంది. తెలుగులో 'వంద దేవుళ్ళు' అనే పేరు ఖరారు చేశారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ సినిమాని నిర్మిస్తున్నారు టాలీవుడ్ హీరో విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేసి, చిత్ర బృందానికి విషెస్ అందజేశారు. "ప్రేమ లోతు పెరిగితే, బంధాలు బలపడితే. ఒక కథ ప్రారంభమవుతుంది" అని విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు.'వంద దేవుళ్ళ' సినిమాలో విజయ్ ఆంటోనీకి జోడీగా 'శంభాల' ఫేమ్ శ్వాసిక నటిస్తోంది.'వంద దేవుళ్ళు' సినిమాలో 'జై భీమ్' ఫేమ్ లిజోమోల్ జోస్ కీలక పాత్ర పోషిస్తోంది. అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. బాలాజీ శ్రీరామ్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.




# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?


టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ఎ÷–లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.



# నాలుగు గంటల సినిమా..దమ్ముండాల్సిందే




## దురంధర్ -2 మూవీ అద్భుతం అన్న రాజమౌళి



రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక్, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.

# పెళ్లిపీటలు ఎక్కిన పునర్నవి

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు. ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నపునర్నవి ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇక భవిష్యత్తులో ఆమె మళ్లీ సినిమాల్లోకి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.



# శంబాల దర్శకుడితో సందీప్ కిషన్ మూవీ




యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో మైలురాయి లాంటి ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవలే 'శంబాల' చిత్రంతో సూపర్ హిట్ అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి భారీ కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రం ఒక హై-వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా ప్రేక్షకులను అలరించనుంది. కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణించరు అనే పవర్‌ఫుల్ మరియు ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, ఇది ఒక గొప్ప చారిత్రక లేదా పురాణ సంబంధిత నేపథ్యం ఉన్న ఎపిక్ సాగా అని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు మరియు మహిధర్ రెడ్డి సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్, ఆయన మునుపటి సినిమాల కంటే భిన్నమైన మేకోవర్‌లో ఉండబోతోందని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దనున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సందీప్ కిషన్, ఈ ఎపిక్ సాగాతో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకోనున్నారు.

# ఎఎ23పై భారీ అంచాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్‌లో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ23'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ సినిమా ఇండియన్ సినీవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌కు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనుండగా, సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ వీడియోతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో ప్రస్తుతం పలు ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ పేరు ÷నైల్ అయిందని ప్రచారం జరుగుతుండగా, తాజాగా మరో స్టార్ హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు పుకార్లుగానే ఉన్నప్పటికీ, అభిమానుల్లో మాత్రం ఆసక్తి పెరుగుతోంది. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే, ఇది పాన్ ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ తెచ్చే ప్రాజెక్ట్ అవుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం



**టెహ్రాన్,మార్చి21( వెలుతురు):**
రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.
హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి.
తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷-గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్-2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్-యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళు న్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ.. ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

# మొన్న భార్య ...నేడు భర్త ఆత్మహత్య

- కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం



**కరీంనగర్, మార్చి21( వెలుతురు):**
కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- హైదరాబాద్ ద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్,మార్చి21( వెలుతురు):**
దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

# డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

- అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

**రంగారెడ్డి,మార్చి21( వెలుతురు):**



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ÷ూజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లిస్తున్నారు సిట్ అధికారులు.

# గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

- ప్రమాదంలో చనిపోయాడన్న పోలీసులు
- హత్య చేశారంటూ స్థానికుల ఆందోళన
- జాతీయ రహదారి దిగ్బంధనం...ఉద్రిక్తత



**లక్నో,మార్చి21( వెలుతురు):**
ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శనివారంనాడు తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతిని ఖండిస్తూ స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గోవుల స్మగ్లింగ్‌ను అనుమానించి ఒక ట్రక్కును వెంబడిస్తుండగా అది ఆయన బైకును ఢీకొట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఫర్సా వాలే బాబాగా పేరున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో కోసి కలాన్ ఏరియాలో జాతీయ రహదారిని గో సంరక్షకులు దిగ్బంధించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ-ఆగ్రా రహదారిపై ఆందోళనలు చోటుచేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడకు చేరుకున్న పోలీసులు, వారి వాహనాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారుల్ని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే నిరసకారులు తిరగబడడంతో.. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు .ఘటనపై మథుర ఎస్ఎస్పీ మాట్లాడుతూ, గోవులను స్మగ్లింగ్ చేస్తున్నారనే అనుమానంతో కంటైనర్ ట్రక్కును బాబా అడ్డుకున్నారని, దట్టమైన మంచు కారణంగా ఆయన బైక్‌ను ట్రక్కు ఢీకొందని తెలిపారు. ట్రక్కులో వైర్లు, రేషన్ సరుకులు ఉన్నాయని, డ్రైవర్, హెల్పర్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. గోవుల స్మగ్లింగ్‌తో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదని, రోడ్డు ప్రమాదంగానే కనిపిస్తోందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఫార్సా వాలే బాబా మృతికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'నేరస్థుల ప్రమేయం ఏమాత్రం ఉన్నా క్షమించి విడిచిపెట్టేది లేదు' అని సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా

- ఇరాన్ అణు కేంద్రంపై వైమానిక దాడులు
- నష్టం లేదని తెలిపిన ఇరాన్
- అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఆరోపణ



**టెహ్రాన్,మార్చి21( వెలుతురు):**
దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# మరింత దిగిన బంగారం ధరలు

- 24 క్యారెట్ పై 2,940 రూపాయలు తగ్గుదల



**న్యూఢిల్లీ,మార్చి21( వెలుతురు):**
అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. మార్చ్ 20న హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 రూపాయలు.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,550 రూపాయలు ఉండింది. అయితే శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 2,750 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970 రూపాయల దగ్గర.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,800 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా భారీగా పతనం అయ్యాయి. నిన్న కిలో వెండి 2,60,000 రూపాయల దగ్గర.. 100 గ్రాముల వెండి 26,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కిలోపై 10 వేల రూపాయలు.. 100 గ్రాములపై వెయ్యి రూపాయలు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి 2,50,000 రూపాయల దగ్గర, 100 గ్రాముల వెండి 25 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## పేద ముస్లిం కుటుంబానికి లోకేశ్ హామీ



**గుంటూరు,మార్చి21( వెలుతురు):**
గతేడాది పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లీం మైనార్టీ సోదరుడికి ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. రంజాన్ వేళ మంగళగిరి బస్టాండ్ సమీపంలో ఉండే షేక్ షహెన్షా ఇంటిని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి లోకేశ్ ఇఫ్తార్ విందు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా షహెన్షా నివసిస్తున్న ఇంటిని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నిర్మించిన రేకుల ఇంటి స్థానంలో నూతన ఇల్లు నిర్మించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మంత్రి లోకేశ్‌ను కోరారు. షహెన్షా కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, నూతన గృహం నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఏడాది తిరగకముందే నూతన ఇంటిని నిర్మించి షేక్ షహెన్షా కుటుంబసభ్యులకు అప్పగించారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం

**విజయనగరం,మార్చి21( వెలుతురు):**
జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళు ండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం. కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.

# తమిళనాడు, కేరళను ఆనుకుని ఉపరిత ఆవర్తనం

- 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం
- వాతావరణ కేంద్రం వెల్లడి

**చెన్నై,మార్చి21( వెలుతురు):**
మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పరిసరాల్లో కేరళ ఆనుకొని ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 24వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com